“
మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU

దినపత్రిక

www.evarthalu.com

“
మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 25-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 265 Issue: 265

Published from Jagitial
Circulated to Telangana

25 మార్చి 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:20 సూర్యాస్తమయం - సా. 6:24 తిథి సప్తమి మ. 1:52 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం మృగశిర సా. 5:34 వరకు తరువాత ఆరుద్ర యోగం సౌభాగ్య తె. 3:09౦ వరకు కరణం వనిజ మ. 1:52 వరకు విష్టి రా. 12:49౦ వరకు వర్జ్యం రా. 1:31 నుండి తె. 3:02 వరకు దుర్ముహూర్తం ఉ. 11:58 నుండి మ. 12:46 వరకు రాహుకాలం మ. 12:22 నుండి మ. 1:52 వరకు యమగండం ఉ. 7:50 నుండి ఉ. 9:21 వరకు గుళికాకాలం ఉ. 10:51 నుండి మ. 12:22 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:44 నుండి తె. 5:32 వరకు అమృత ఘడియలు ఉ. 9:17 నుండి ఉ. 10:47 వరకు అభిజిత్ ముహూర్తం లేదు



# పెట్రో ప్యానిక్!

## ప్రధాని వ్యాఖ్యలతో ఉలిక్కిపడ్డ జనం

### వాహనాలతో బంకుల వద్దకు క్యూ.. కొన్ని చోట్ల కిలోమీటర్ మేర లైన్

### హైదరాబాద్‌లో పలు బంకులు క్లోజ్.. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితులే

ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా యుద్ధం నేపథ్యంలో దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ తదితరాలపై భారీ ప్రభావం పడుతోంది. అనేక రాష్ట్రాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం రాజ్యసభలో మాట్లాడిన ప్రధాని మోదీ.. పశ్చిమాసియాలో యుద్ధం ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఇంధన సంక్షోభాన్ని సృష్టించిందని పేర్కొనడంతో వాహనదారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రేపటి రోజు అనేదే లేకుండా, ప్రజలు వాహనాలతో బంకుల వద్దకు క్యూ కట్టారు.

హైదరాబాద్, మార్చి 24 (ఈవార్తలు): గతంలో కొవిడ్ సమయంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలు, సరుకుల కొరత వంటి జ్ఞాపకాలు ప్రజలను ముందస్తు జాగ్రత్తల పేరుతో 'ప్యానిక్ బయ్యింగ్' (భయంతో కొనుగోలు చేయడం) వైపు నెట్టాయి. ఒకవైపు వదంతులు వేగంగా వ్యాపిస్తుంటే, మరోవైపు కొన్ని చోట్ల రవాణా రంగంలో తలెత్తిన అంతరాయాలు అగ్నికి ఆజ్యం పోశాయి. పెట్రోల్, డీజిల్ నిల్వలు నిండుకుంటున్నాయన్న వార్తతో బంకుల యాజమాన్యాలు చేతులెత్తేయడం, లేదా వచ్చిన రద్దీని తట్టుకోలేక మూసివేయడం వంటి ఘటనలు పరిస్థితి తీవ్రతను పెంచాయి. ఇది కేవలం ఇంధనానికే పరిమితం కాకుండా, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుందన్న ఆందోళన మధ్యతరగతి వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

**హైదరాబాద్‌లో నో స్టాక్ బోర్డులు**

రాష్ట్రంలోని నగరాల నుంచి పల్లెల వరకు దాదాపు అన్ని పెట్రోల్ బంకుల వద్ద భారీ క్యూ లైన్లు కనిపిస్తున్నాయి. ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో అనేక బంకులు ఇప్పటికే 'నో స్టాక్' తరువాయి 2 వ పేజీలో...






# సవాళ్లు.. సిద్ధంగా ఉందాం!

## సమస్యలను ఐక్యంగా ఎదుర్కొందాం

### యుద్ధంతో భారీ ఇంధన సంక్షోభం.. యుద్ధం కొనసాగితే తీవ్ర పరిణామాలు

### అన్ని వనరుల నుంచి చమురు తెస్తున్నాం.. రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రకటన

పశ్చిమాసియాలో యుద్ధం ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఇంధన సంక్షోభాన్ని సృష్టించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అందుకే భారత ప్రభుత్వం అందుబాటులో ఉన్న అన్ని వనరుల నుంచి గ్యాస్, ముడి చమురును సేకరించేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఈ ప్రయత్నాలు కొనసాగుతాయని చెప్పారు.

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ మంగళవారం రాజ్యసభలో పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై మాట్లాడారు. పశ్చిమాసియాలో యుద్ధం ఆందోళన కలిగిస్తోందని.. చర్చలు, దౌత్యం ద్వారా ఆ ప్రాంతంలో శాంతిని నెలకొలని భారతదేశం కోరుకుంటోందని చెప్పారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో యుద్ధం వల్ల నెలకొన్ని ఉద్రిక్తతలను తగ్గించడం, హార్మూజ్ జలసంధి తెరిచేలా చూడటమే భారత లక్ష్యమని చెప్పారు. అన్ని సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకునేలా అన్ని పక్షాలను ప్రోత్సహించడమే భారత దేశ ప్రయత్నమని తెలిపారు. పశ్చిమాసియాలో సంక్షోభం ఎక్కువ కాలం కొనసాగితే... తీవ్ర పరిణామాలు తప్పవని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. -2 వ పేజీలో...

## హార్మూజ్ అత్యవసరం

**జలసంధి తెరిచి ఉంచాల్సిందే.. శాంతి, స్థిరత్వం దిశగా వెళ్లాలి**

**ట్రంప్‌తో ఫోన్‌లో మోదీ సంభాషణ** 2



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,291 |
| వెండి (గ్రాము): | రూ.250 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,550 |

# డీలిమిటేషన్‌పై పోరాటం

### దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాలి.. సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

'నేను దేశ రాజకీయాల్లో పనిచేయాలనేది పార్టీ నిర్ణయిస్తుంది. మోదీ త్రీడి పాలసీకి వ్యతిరేకంగా దక్షిణ భారతం ఐక్యం కావల్సి ఉంది' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కేరళ, తెలంగాణ, ఏపీ, తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక నుంచి కేంద్రంలో తక్కువ ప్రాతినిధ్యం ఉంది" అని సీఎం అన్నారు.



హైదరాబాద్, మార్చి 24 (ఈవార్తలు): దక్షిణాది రాష్ట్రాలు డీలిమిటేషన్ పై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. వెంకయ్య నాయుడును రాష్ట్రపతి ఎందుకు చేయాలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు దక్షిణాది నుంచి రాష్ట్రపతులు అయ్యారని సీఎం గుర్తుచేశారు. కాంగ్రెస్.. దేశం మొత్తం ఒక్కటే అన్న సందేశం ఇచ్చిందన్నారు. బీజేపీకి సొంత నేతలపైనే నమ్మకం లేదన్నారు. 'రాహుల్ గాంధీ దేశం గురించి ఆలోచిస్తున్నారు. నిర్ణయాలు తీసుకునే తరువాయి 2 వ పేజీలో...



# ..మేం స్వాగతిస్తున్నాం

**నియోజకవర్గాల డీలిమిటేషన్ మంచిదే**

### పార్లమెంట్‌లో దక్షిణాదికి 24% ప్రాతినిధ్యం

### కేంద్రం అన్యాయం చేస్తుందనుకోను: కేటీఆర్

నియోజకవర్గాల డిలిమిటేనేషన్‌ను స్వాగతిస్తున్నామన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. డిలిమిటేషన్ అనేది ఎప్పుడో జరగాలని, ఇప్పటికే ఆలస్యమైందన్నారు. ఏపీ విభజన చట్టంలోనే నియోజకవర్గ పునర్విభజన హామీ ఉందన్నారు కేటీఆర్. ఈ మేరకు మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. ' పార్లమెంట్‌లో దక్షిణాదికి 24 శాతం ప్రాతినిధ్యం ఉంది. దానిని యథావిధిగా కొనసాగించాలి.

హైదరాబాద్, మార్చి 24 (ఈవార్తలు): కేంద్రం దక్షిణానికి అన్యాయం చేస్తుందని నేను అనుకోను. దక్షిణాది కుటుంబ నియంత్రణను బాగా పాటించింది. కుటుంబ నియంత్రణ పాటించని వారికి నజరానా.. పాటించిన వారికి జురుమానా అంటే కుదురదు. అలాంటి తప్పు ప్రభుత్వం చేస్తుందని అనుకోను. డీలిమిటేషన్ జరిగితే ప్రజలకు సేవ చేసే అవకాశం ఎక్కువ మందికి వస్తుంది. అశ్వారావుపేటలో ఒక లక్షా 30వేల ఓట్లు ఉంటే.. శేరిలింగంపల్లిలో 9 లక్షల ఓట్లు ఉన్నాయి. డిలిమిటేషన్‌తో ఈ వ్యత్యాసం పోతుంది' అని అన్నారు. ఇక ఫార్ములా రేస్ కేసు గురించి కేటీఆర్ మాట్లాడుతూ.. తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



క్యూబాలో ఆహార సంక్షోభాన్ని నివారించేందుకు ఈ ఏడాది ప్రారంభంలో చైనా 60,000 టన్నుల బియ్యాన్ని విరాళంగా అందజేసింది. ఈ మొత్తం క్యూబా ప్రజలకు నెల పాటు సరిపోతాయి. అంతేకాకుండా, 80 మిలియన్ డాలర్ల ఆర్థిక సహాయాన్ని కూడా చేసింది.

# క్రైస్తవులకు ఎస్సీ హోదా ఉండదు



### హిందూ, సిక్కు, బౌద్ధులకే ఆ హక్కు

### సుప్రీం కోర్టు స్పష్టీకరణ

కులం హోదా అంశంలో ఇవాళ సుప్రీంకోర్టు(Supreme Court) కీలక తీర్పును వెలువరించింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన దళితులు మాత్రమే షెడ్యూల్ కులాల కింద హోదా పొందేందుకు అర్హులని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మూడు మతాలు కాకుండా మరో మతానికి మారితే ఎస్సీలకు ఆ హోదా ఉండదని కోర్టు పేర్కొన్నది.

న్యూఢిల్లీ: క్రైస్తవ మతాన్ని స్వీకరించిన వారికి షెడ్యూల్ కులాల హోదా దక్కదని కోర్టు స్పష్టం చేసింది. అంటే ఓ దళిత వ్యక్తి ఎవరైనా క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే, అప్పుడు అది ఎస్సీ-ఎస్టీ చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని సుప్రీం పేర్కొన్నది. జస్టిస్ పీకే మిశ్రా, మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం ఓ కేసులో ఆ ఆదేశాలు ఇచ్చింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు కాకుండా మరో మతానికి మారితే, -2 వ పేజీలో...

# హైదరాబాద్‌లో రాళ్ల వాన

### నిన్న సాయంత్రం కుండపోత వర్షం

### రాష్ట్రవ్యాప్తంగా చల్లబడ్డ వాతావరణం

### పలు చోట్ల అకాల వర్షాలు.. రైతుకు దెబ్బ



హైదరాబాద్, మార్చి 24 (ఈవార్తలు): హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. పలు చోట్ల భయంకరంగా రాళ్ల వర్షం కురిసింది. మియాపూర్, కూకట్‌పల్లి, బోరబండ, చందానగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో వాన బీభత్సం సృష్టించింది. రాళ్ల వానకు నగర వాసులకు భయాందోళనకు గురయ్యారు. భారీ వర్షం కారణంగా పలు ఏరియాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ఆఫీస్‌ల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. కాగా, గత వారం రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎండల తరువాయి 2 వ పేజీలో...



# జీవన్ రెడ్డి ఇంటికీ టీపీసీసీ చీఫ్

### అయినా వెనక్కి తగ్గని మాజీమంత్రి

### ఇంటిపై ఇందిరాగాంధీ ఫ్లెక్సీల తొలగింపు

జగిత్యాల, మార్చి 24 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీపై తీవ్ర అసంతృప్తితో ఉన్న సీనియర్ నేత, జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పార్టీని వీడేందుకే సిద్ధమయ్యారు. ఇప్పటికే పార్టీ హైకమాండ్ రంగంలోకి దిగి జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి. తాజాగా తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

25.3.2026

మేషం: నూతన వస్తు వాహన లాభాలు పొందుతారు. పాత మిత్రులతో సేవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆప్తుల నుండి విలువైన విషయాలు సేకరిస్తారు. గృహ వాతావరణం ఆనందంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలు అనుకూలిస్తాయి. ఉద్యోగాలలో సమస్యలు తొలగి ఊరట పొందుతారు.

వృషభం: ముఖ్యమైన వ్యవహారాల్లో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం వలన నష్టాలు తప్పవు. చేపట్టిన పనులు మరింత మందకొడిగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. దూర ప్రయాణాల వలన వృధా ఖర్చులు పెరుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఉద్యోగాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది.

మిధునం: కుటుంబ విషయాలలో మాట పట్టింపులు తొలగుతాయి. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందుతుంది. ముఖ్యమైన వ్యవహారాలు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. నూతన వాహనం యోగం ఉన్నది. వృత్తి వ్యాపారాలలో అంచనాలకు మించి లాభాలు అందుకుంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

కర్కాటకం: సమాజంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. ఆర్థికపరమైన ఒడిదుడుకుల నుండి బయటపడతారు. చేపట్టిన వ్యవహారాలలో అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులతో విందువినోదాది కార్యక్రమాల్లో పాల్గొంటారు. నిరుద్యోగులకు సదావకాశాలు లభిస్తాయి. ఉద్యోగస్తులకు అధికారుల అనుగ్రహం కలుగుతుంది.

సింహం: కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వలన మానసిక ప్రశాంతత కలుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. నూతన ఋణ ప్రయత్నాలు అంతగా కలిసిరావు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగులకు స్థానచలన సూచనలున్నవి.

కన్య: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సోదర సంబంధిత విషయమై మాటపట్టింపులు ఉంటాయి. చేపట్టిన పనులలో స్వల్ప అవరోధాలుంటాయి. ఇంటాబయట ఋణ పరమైన ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో భాగస్వాములతో వివాదాలకు వెళ్లకపోవడం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి పెరుగుతుంది.

తుల: నూతన వాహన కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. కుటుంబ సభ్యులతో సఖ్యత పెరుగుతుంది. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగులకు ఉన్నత అవకాశాలు లభిస్తాయి. కొన్ని వ్యవహారాలలో జీవిత భాగస్వామి సహాయ సహకారాలు తీసుకోవడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో ఆశించిన పురోగతి లభిస్తుంది.

వృశ్చికం: సమాజంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ఆర్థికంగా మెరుగైన వాతావరణం ఉంటుంది. అవసరానికి బంధుమిత్రుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి వ్యాపారాలలో స్వంత నిర్ణయాలు కలసివస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ సమర్థతకు అధికారుల నుంచి గుర్తింపు లభిస్తుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

ధనస్సు: వృత్తి వ్యాపారాల్లో నూతన సమస్యలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతల వలన విశ్రాంతి లభించదు. కుటుంబ సభ్యులతో అకారణంగా మాట పడవలసి వస్తుంది. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. మిత్రులతో మాటపట్టింపులుంటాయి. వాహన ప్రయాణ విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి.

మకరం: దూరపు బంధువుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో వ్యయ ప్రయాసలు అధికం అవుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ విషయమై అధికారులు చర్చలకు వెళ్లకపోవడం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు నిదానంగా సాగుతాయి.

కుంభం: ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. గృహ నిర్మాణ పనులు వేగవంతం చేస్తారు. ముఖ్యమైన పనులు అప్రయత్నంగా పూర్తి చేస్తారు. వ్యాపారాల్లో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు ఉన్నపటికీ నిదానంగా పూర్తిచేస్తారు.

మీనం: అవసరానికి చేతిలో డబ్బునిలువ ఉండదు. వృత్తి వ్యాపారాలలో అధిక శ్రమకు అల్ప ఫలితం పొందుతారు. కుటుంబ సభ్యుల మాటలు మానసికంగా భాధ కలిగిస్తాయి. ఉద్యోగ వాతావరణం చికాకుగా ఉంటుంది. నిరుద్యోగ యత్నాలు కొంత మందకొడిగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

# పెట్రో ప్యానిక్!

**మొదటి పేజీ తరువాయి**

బోర్డులను ప్రదర్శిస్తున్నాయి. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, కూకట్‌పల్లి, ఎల్బీనగర్ వంటి ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఉదయం నుంచి మొదలైన రద్దీ అర్ధరాత్రి దాటినా తగ్గలేదు. స్టాక్ ఎప్పుడు అయిపోతుందో అన్న ఆందోళనతో వాహనదారులు గంటల తరబడి వేచి చూస్తున్నారు. బంకుల బయట రోడ్ల మీదకే వాహనాలు క్యూ కట్టడంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, డెలివరీ బాయ్స్, అత్యవసర సేవల వాహనదారులు బంకుల వద్ద బారులు తీరారు. పాతబస్తీలోని సీఎన్‌జీ ఫిల్లింగ్ సెంటర్ వద్ద ఆటో డ్రైవర్లు భారీగా ఎదురుచూపులు చూస్తున్నారు. పాతబస్తీతోపాటు బహదూర్‌పురా, అంబర్‌పేట్, తాడ్‌బండ్, హస్సన్ నగర్ ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు మూతపడ్డాయి.డబ్బులు చెల్లిస్తేనే పెట్రోల్, డీజిల్ బంకులకు సరఫరా చేస్తామంటూ ఆయిల్ కంపెనీలు.. ఇటీవలి కాలంలో కొత్తగా మెలిక పెడుతుండటంతో పెట్రోల్ బంకుల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డబ్బులు లేక చాలా మంది పెట్రోల్ బంక్ డీలర్లు చమురు కొనడం ఆపేయడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ఆయిల్ కంపెనీలు క్రెడిట్ ఇచ్చేవని.. కానీ ఇప్పుడు చమురు కొరత నేపథ్యంలో క్రెడిట్ ఇవ్వకపోవడంతోనే బంకులు మూసివేసే పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నాయి.

## చమురు కొరత లేదు: తెలంగాణ సర్కారు

చమురు కొరత ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం కొట్టిపారేసింది. రాష్ట్రంలో సరిపడా నిల్వలు ఉన్నాయని స్పష్టం చేసింది. ఎవరూ భయపడాల్సిన పని లేదని.. ఆందోళనకు గురై.. పెట్రోల్, డీజిల్ ఉన్నప్పటికీ.. మరింత కావాలని పెట్రోల్ బంకుల ముందు క్యూ కట్టొద్దని సూచిస్తోంది.



వాహనదారులు అనవసరంగా కంగారు పడొద్దని తేల్చి చెప్పింది. దేశంలో ఇంధన సరఫరాలో ఎలాంటి కొరత లేదని కేంద్ర పెట్రోలియం శాఖ అధికారులు కూడా వెల్లడించారు. అటు.. హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత ఉందంటూ వస్తున్న వార్తలపై నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పందించారు. నగరంలో ఇంధన నిల్వలు నిండుకున్నాయనేది కేవలం అపోహ మాత్రమేనని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. నగరవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీల దగ్గర సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా ఎక్కడా ఆగిపోలేదని సీపీ తెలిపారు. కొరత ఉందన్న ఆందోళనతో పెట్రోల్ బంక్‌ల వద్ద భారీగా క్యూ కట్టవద్దని, అనవసరంగా ఇంధనాన్ని నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించవద్దని ఆయన పౌరులకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సిటీ పోలీస్ యంత్రాంగం ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని, రవాణా సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను వదంతులను నమ్మవద్దని, వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని సీపీ హెచ్చరించారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని సూచించారు. నగరంలో సాధారణ పరిస్థితులు కొనసాగేందుకు ప్రజలందరూ సహకరించాలని సీపీ కోరారు. రద్దీ వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బంక్‌ల వద్ద బారులు తీరవద్దని సూచించారు.

# సవాళ్లు.. సిద్ధంగా ఉందాం!

**మొదటి పేజీ తరువాయి**

ఇంధన భద్రత కోసం భారతదేశం చేస్తున్న ప్రయత్నాలపై ప్రధాని మోదీ మాట్లాడుతూ... గత 11 ఏళ్లలో 53 లక్షల మెట్రిక్ టన్నుల వ్యూహాత్మక చమురు నిల్వలను సృష్టించామని, అదనంగా 65 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంపై పనులు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. అంతేకాకుండా నౌకల తయారీకి ప్రభుత్వం 70,000 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టును ప్రారంభించిందని ఆయన తెలిపారు. హర్మూజ్ జలసంధిలోని నౌకల్లో చిక్కుకుపోయిన పలువురు భారతీయుల భద్రత పట్ల ప్రధానమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్ యుద్ధం కారణంగా తలెత్తే అవకాశం ఉన్న ఇంధన సంక్షోభం ముప్పును కూడా ఆయన ప్రస్తావించారు. అలాగే, గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న, ఉపాధి పొందుతున్న దాదాపు కోటి మంది భారతీయులకు రక్షణ కల్పించడం కూడా భారతదేశానికి తీవ్ర ఆందోళన కలిగించే అంశమేనని పేర్కొన్నారు. యుద్ధం కారణంగా దిగుమతి-ఎగుమతి కార్యకలాపాలలో ఎదురయ్యే ఏవైనా ఇబ్బందులను అంచనా వేయడానికి, అవసరమైన పరిష్కారాలను రూపొందించడానికి నిరంతరం కృషి చేసే ఒక ఇంటర్



మినిస్టీరియల్ బృందాన్ని ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాటు చేసిందని మోదీ తెలిపారు. ఈ బృందం క్రమం తప్పకుండా సమావేశమవుతుందని చెప్పారు. వివిధ రంగాలలో సవాళ్లను ఎదుర్కోవడానికి కోవిడ్-19 మహమ్మారి సమయంలో నిపుణులు, అధికారులతో కూడిన సాధికార బృందాలను ఏర్పాటు చేసినట్లే... ఇప్పుడు కూడా పరిస్థితులను సమన్వయం చేసుకోవడానికి సోమవారం ఏడు కొత్త సాధికార బృందాలను ఏర్పాటు చేశారని తెలిపారు. సప్లై చైన్‌లు, పెట్రోలియం, డీజిల్, ఎరువులు, సహజ వాయువు, ద్రవ్యోల్బణం వంటి కీలక సమస్యలపై తక్షణ, దీర్ఘకాలిక వ్యూహాల మార్గదర్శకత్వంలో చర్యలు తీసుకునే బాధ్యతను ఈ బృందాలకు అప్పగించనున్నట్టుగా చెప్పారు. ఈ సమిష్టి కృషి ద్వారా తాము ప్రస్తుత పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించగలమని తనకు పూర్తి నమ్మకం ఉందని అన్నారు. 'మనం ప్రతి సవాలును ఓర్పుతో, సంయమనంతో, ప్రశాంతమైన మనసుతో ఎదుర్కోవాలి... నిరంతరం మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఏర్పడే ప్రతి సవాలుకూ సిద్ధంగా ఉండాలి' అని ప్రజలను మోదీ కోరారు. దేశ ప్రజల సంక్షేమమే తమకు అత్యంత ప్రాధాన్య అంశమని పేర్కొన్న మోదీ.. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ..మేం స్వాగతిస్తున్నాం

**మొదటి పేజీ తరువాయి**

'ఆరు గ్యారంటీల డైవర్షన్ కోసమే ఈ ఫార్ములా కేసు. చార్జ్‌షీట్. ప్రజల దృష్టిని మరల్చడానికి చార్జ్‌షీట్ వ్యవహారం. ఫార్ములా ఈ-రేసింగ్ కేసు లొట్టపీస్ కేసు. నేను మొదటి నుంచి చెప్తున్న.. ఇది లొట్ట పీస్ కేసు. న్యాయస్థానాల్లో ఫార్ములా ఈ -రేసు కేసు నిలబడదు. ఈకేసులో ఎవరికైతే లబ్ధి జరిగిందని చెప్తున్నారో.. వారితో రేవంత్ దావోస్‌లో మంతనాలు జరిపారు. కక్ష ఉంటే నామీద తీర్చుకోండి. అధికారులను ఎందుకు బలి చేస్తున్నారు?, డబ్బులు చెల్లింపుపై నేనే మంత్రిగా నిర్ణయం తీసుకున్నాను. దమ్ముంటే నామీద చర్యలు తీసుకోవాలి. ఎక్కడా డబ్బులు దారి మళ్ళలేదు. తప్పు జరగలేదు. బ్యాంక్ టు బ్యాంక్ ట్రాన్సక్షన్ జరిగింది. అరెస్ట్‌ల గురించి రేవంత్ రెండేళ్ళుగా చెప్తూనే ఉన్నారు. రిమాండ్‌కు పంపేది కోర్టులు.. రేవంత్ రెడ్డి కాదు' అని పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో రాళ్ల వాన

తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షాలు పెద్ద ఉపశమనం కలిగించాయి. ఉక్కపోత తగ్గి వాతావరణం చల్లబడటంతో జనం ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే సాధారణ ప్రజలకు సంతోషాన్నిచ్చిన ఈ వాతావరణ మార్పు అన్నదాతలకు కన్నీటిని మిగులుస్తోంది. అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతినే ప్రమాదం పొంచి ఉండటంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ అకాల వర్షాల నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు. పొలాల్లో ఉన్న పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచిస్తున్నారు. మరోవైపు రాజధాని హైదరాబాద్ నగరంలో కూడా వాతావరణం వేగంగా మారిపోయింది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వర్షం మొదలైంది. రాబోయే ఒకటి రెండు గంటల్లో భాగ్యనగరంలోని పలు ఏరియాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.

# హర్మూజ్ అత్యవసరం

**జలసంధి తెరిచి ఉంచాల్సిందే**

**ట్రంప్‌తో ఫోన్‌లో మోదీ సంభాషణ**

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. ఇరువురు నేతలూ మధ్య హర్మూజ్ జల సంధి తెరిచి ఉంచాల్సి ప్రాముఖ్యతతో సహా పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితి గురించి చర్చించారని భారత్ అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. ఇరాన్‌తో ఇజ్రాయెల్- అమెరికా యుద్ధం మొదలైన తర్వాత మోదీ, ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుకోవడం ఇదే మొదటిసారి. ఇక, ట్రంప్ నుంచి తనకు ఫోన్ కాల్ వచ్చిన విషయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ధ్రువీకరించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు. 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాకు ఫోన్ చేశారు.. మా ఇరువురం మధ్య పశ్చిమాసియాలో నెలకున్న పరిస్థితులపై విలువైన అభిప్రాయాలను పంచుకున్నాం.. ఉద్రిక్తతలను తగ్గించుకుని, వీలైనంత త్వరగా ఉద్రిక్తతలను తగ్గించి, శాంతిని పునరుద్ధరించడానికి భారత్ మద్దతు ఇస్తుంది. హర్మూజ్ జలసంధి తెరిచి, సురక్షితంగా అందుబాటులో ఉండేలా చూడటం ప్రపంచానికి అత్యవసరం. శాంతి, స్థిరత్వం దిశగా చేసే ప్రయత్నాలలో భాగంగా సంప్రదింపులు కొనసాగించాలని మేము అంగీకరించాం' అని ప్రధాని మోదీ అన్నారు. పశ్చిమాసియాలో యుద్ధం ముగింపు కోసం ఇరాన్‌తో చర్చలు జరిపినట్లు అమెరికా అధ్యక్షుడు ప్రకటించిన మర్నాడే ట్రంప్-మోదీల మధ్య ఈ సంభాషణ జరిగింది.

# జీవన్ రెడ్డి ఇంటికీ టీపీసీసీ చీఫ్

**మొదటి పేజీ తరువాయి**

మంగళవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ రంగంలోకి దిగినా జీవన్ రెడ్డి వెనక్కి తగ్గడం లేదు. పార్టీ నుంచి వెళ్లిపోవాలనే ఆయన డిసైడ్ అయ్యారు. జగిత్యాలకు వెళ్లి జీవన్ రెడ్డితో భేటీ అయిన పీసీసీ చీఫ్.. పార్టీలోనే కొనసాగాలని.. కాంగ్రెస్‌ను వీడొద్దని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తుపై చర్చిద్దామని చర్చలు జరిపారు. అంతకుముందు ఏఐసీసీ నేతలు కూడా జీవన్ రెడ్డి పార్టీలోనే కొనసాగాలని ఆయనను కోరినా.. జీవన్ రెడ్డి మాత్రం తన పంతం వీడటం లేదు. ఇక ఈ భేటీ తర్వాత మీడియాతో మాట్లాడిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.. జీవన్ రెడ్డి తనకు తండ్రి సమానులు అని, 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన నేత అని తెలిపారు. తెలంగాణలో జీవన్ రెడ్డి కన్నా సీనియర్ నాయకులు లేరని.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కొంత ఇబ్బంది పడ్డారని పేర్కొన్నారు. రాజకీయాల్లో కొన్నిసార్లు అనుకోని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఆయన ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టే తన సూచనల మేరకు మంత్రి శ్రీధర్ బాబు కూడా వచ్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని తెంచుకోవద్దని.. తమను వీడొద్దని వారికి విన్నవించినట్లు చెప్పుకొచ్చారు. కార్యకర్తల ఒత్తిడి కారణంగా జీవన్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. జీవన్‌రెడ్డితో తనకు 1986 నుంచి పరిచయం ఉందని.. అప్పటి నుంచి తనకు రాజకీయంగా సలహాలు ఇచ్చారని తెలిపారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయరనే ఆశతో జగిత్యాల నుంచి వెళ్తున్నానని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. మరోవైపు, భేటీ సందర్భంగా.. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకునేందుకు కూడా జీవన్ రెడ్డి ఆసక్తి చూపకపోవడం గమనార్హం. మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో పార్టీ నేతలు జీవన్ రెడ్డి మెడలో హస్తం పార్టీ కండువా వేసేందుకు ప్రయత్నించగా ఆయన తిరస్కరించారు.

## ఇందిరాగాంధీ ఫ్లెక్సీ తొలగింపు

భేటీ తర్వాత జీవన్ రెడ్డి తన ఇంటిపై ఉన్న కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీని తొలగింపజేశారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన జీవన్‌రెడ్డి.. ఇది పరిష్కారం లేని సమస్యగా మారిందని, ఆ సమస్యకు పరిష్కారం కూడా తన వద్ద లేదని తెలిపారు. బుధవారం 10 గంటలకు కార్యకర్తలు అందరు భేటీ కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తు, తన తర్వాతి పయనం ఎలా ఉంటుందో తెలియదని పేర్కొన్న జీవన్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీలో ఉండి స్వపక్షంతో యుద్ధం చేయలేనని తేల్చి చెప్పారు. తన నిర్ణయాన్ని బుధవారం ప్రకటించనున్నట్లు చెప్పిన జీవన్ రెడ్డి.. తన నిర్ణయం దైవ నిర్ణయంగా భావిస్తున్నానని స్పష్టం చేశారు.

# క్రైస్తవులకు ఎస్సీ హోదా ఉండదు

**మొదటి పేజీ తరువాయి**

వారు ఎస్సీ హోదాను కోల్పోతారని కోర్టు చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పాస్టర్ చిందాడ ఆనంద్ దాఖలు చేసిన పిటీషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టి ఈ ఆదేశాలు ఇచ్చింది. మే 2025లో ఏపీ హైకోర్టు ఈ కేసులో తీర్పును వెలువరించింది. అక్కాల రామిరెడ్డి అనే వ్యక్తి నుంచి కుల వివక్షణ ఆరోపణలు ఎదుర్కొన్నట్లు ఆనంద్ తన పిటీషన్‌లో పేర్కొన్నాడు. ఎస్సీ-ఎస్టీ చట్టం కింద ఆ పాస్టర్ ఫిర్యాదు నమోదు చేశాడు. అతని ఫిర్యాదు ప్రకారం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ రామిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆనంద్ అనే వ్యక్తి క్రైస్తవ మతాన్ని స్వీకరించడం వల్ల ఎస్సీ హోదాను కోల్పోయాడని, అందుకే ఆ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తున్నట్లు జస్టిస్ ఎన్ హరినాథ్ తన తీర్పులో పేర్కొన్నారు. క్రైస్తవాన్ని ప్రచారం చేస్తున్న దళిత వ్యక్తి.. ఎస్సీ-ఎస్టీ చట్టం కింద న్యాయం పొందలేడని కోర్టు చెప్పింది. క్రైస్తవ మతానికి మారడం వల్ల ఆనంద్ వద్ద ఉన్న ఎస్సీ సర్టిఫికేట్ పనికిరాదు అని కోర్టు తెలిపింది. దీంతో హైకోర్టు తీర్పును తప్పుపడుతూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. అయితే హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ఇవాళ సుప్రీం తీర్పును ఇచ్చింది.

# డీలిమిటేషన్‌పై పోరాటం

**మొదటి పేజీ తరువాయి**

ముందు ఆల్ పార్టీ మీటింగ్ కి పిలుస్తున్నారు. తెలంగాణ మోడల్ చాలా రేర్. అహ్మదాబాద్ కి హైదరాబాద్ తో పోలిక లేదు. గుజరాత్ లో టాక్స్ హాలిడే అనుమతులు ఇస్తున్నారు. పెట్టుబడులు పెట్టడానికి ప్రధాని గుజరాత్ ను సూచిస్తున్నారు. తెలంగాణ కూడా దేశంలో భాగమే. దేశానికి బ్రాండ్ అంబాసిడర్ లా ప్రధాని మోదీ వ్యవహరించాలి. గుజరాత్ మోడల్ ను తెలంగాణ మోడల్ అనుకరిస్తుందన్న దానిపై స్పందిస్తూ.. మంచి నిర్ణయాలు ఎక్కడున్నా పాటిస్తాం. గుజరాత్ లో సబర్మతి రివర్ ఫ్రంట్ చేశారు. హైదరాబాద్ లో మూసీ రివర్ ఫ్రంట్ చేస్తుంటే బీజేపీ అడ్డుకుంటుంది. మహాత్మా గాంధీ విగ్రహానికి రూ.70-80 కోట్లు ఖర్చు చేస్తున్నాం. మూసీ నది వద్ద బాపు ఘాట్ ఏర్పాటు చేస్తున్నాం' అని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలు బాగుండాలని సీఎం అన్నారు. రాష్ట్రానికి మూడు బుల్లెట్ రైళ్లు ఇచ్చినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపానన్నారు. మోదీ మంచి చేస్తే మంచి చేశారని చెబుతానని, తప్పు చేస్తుంటే తప్పని చెబుతానన్నారు. ప్రజల సమస్యల ఆధారంగా గ్యారెంటీలు అమలుచేస్తున్నామన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామన్నారు. ఆర్థిక వనరులు తక్కువ ఉన్నాయి కాబట్టి కొన్ని పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఇక, గత బీఆర్ఎస్ ప్రభుత్వం 6-7 శాతం వడ్డీ వదిలేసి, అధిక వడ్డీలకు అప్పులు తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. నచ్చితే నజరానా నచ్చకపోతే జరిమానా అన్నట్లుగా గత ప్రభుత్వ వైఖరి ఉండేదన్నారు. సోలార్ ఎనర్జీ ద్వారా దేశాన్ని కాపాడాలని ప్రతి రోజు సూర్య భగవానుని ప్రార్థిస్తున్నానన్నారు. బంగ్లాదేశ్,శ్రీలంక,చైనా,అమెరికా ఏ దేశం కూడా భారతతో కలిసి పనిచేయడంలేదన్నారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపి విద్యార్థులను తీసుకువచ్చినట్లు యుద్ధాన్ని ఆపి చమురు తీసుకురావచ్చు కదా, దేశంలో గ్యాస్, పెట్రోల్ కొరత ఏర్పడుతుందన్నారు. ఈ సమయంలో మోదీకి మద్దతుగా ఉంటామన్నారు. మోదీ యాక్షన్ ప్లాన్ ఏంటో తెలపాలని డిమాండ్ చేశారు.

**PUBLIC NOTICE**

మహర్ష గ్రూప్ సంస్థలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. గత కొన్ని సంవత్సరాలుగా మహర్ష గ్రూప్ సంస్థలకు డైరెక్టర్‌గా పనిచేసి, గత రెండు సంవత్సరాలుగా కంపెనీకి దూరంగా ఉంటున్నాను. సోమవారం (23 మార్చి 2026) రోజున కంపెనీ డైరెక్టర్‌గా రాజీనామా చేశాను. కాబట్టి కంపెనీ లావాదేవీలకు, నాకు ఎలాంటి సంబంధం లేదని తెలుపుతున్నా. కస్టమర్లు, ఏజెంట్లు ఇది గమనించగలరు. ఏదైనా ఉంటే కంపెనీ యజమాన్యంతో మాట్లాడుకోవాలని విన్నవిస్తున్నా.

**- గుండెబోయిన వెంకన్న**

# ఆకాశవాణి అంటేనే విశ్వాసం

## డిజిటల్ యుగంలోనూ సుస్థిరం.. ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్

హైదరాబాద్, మార్చి 24 (పీఐబీ): డిజిటల్ యుగంలోనూ ఆకాశవాణి వార్తలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయని ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్ అన్నారు. సంప్రదాయ రేడియో వార్తా ప్రసారంతోపాటు సోషల్ మీడియాలోనూ ఆకాశవాణి ప్రత్యేకత చాటుకుంటుందన్నారు. హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో కవాడిగూడ సీజీవో టవర్స్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన పార్ట్‌టైమ్ కరస్పాండెంట్లు, క్యాజువల్ న్యూస్ ఎడిటర్లు, న్యూస్ రీడర్ల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రాంతీయ వార్తా విభాగాధిపతి, డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎస్. మహేశ్ అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ జైన్ మాట్లాడుతూ.. ఆకాశవాణి తన కరస్పాండెంట్లకు ఎప్పటికప్పుడు శిక్షణ తరగతులు నిర్వహిస్తూ వృత్తి మెలకువలను పెంపొందిస్తోందన్నారు. సోషల్ మీడియా ఒత్తిడి నేపథ్యంలో వార్తలను తక్షణమే ప్రసారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడినప్పటికీ, విశ్వసనీయతను కాపాడుకుంటూ, ఆ సవాలును అధిగమించాలని రాజీవ్ కుమార్ జైన్ కరస్పాండెంట్లకు సూచించారు. సేకరించిన సమాచారాన్ని పరిశీలించి, నిర్ధారించుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతికత వల్ల వార్తకు నిర్వచనం మారిపోయిందన్నారు. ప్రభుత్వ సంస్థగా ఆకాశవాణి కచ్చితత్వాన్ని, ధర్మనిష్టనూ పాటించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పీఐబీ–హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ మాట్లాడుతూ.. వాట్సాప్ ద్వారా వ్యాప్తి చెందుతున్న తప్పుడు వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కొవిడ్–19 విపత్తు సమయంలో పీఐబీ ప్రారంభించిన 'ఫ్యాక్ట్ చెక్' విభాగం గురించి ఆమె వివరించారు. ప్రభుత్వ సమాచార వారధులుగా క్షేత్రస్థాయి అభివృద్ధి నివేదికలపై విలేకరులు దృష్టి సారించాలని సూచించారు. ఆకాశవాణి, హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, క్లస్టర్ హెడ్ హరిసింగ్ మాట్లాడుతూ.. విశ్వసనీయతకూ, సమగ్రతకూ, సంపూర్ణతకూ ఆకాశవాణి మారుపేరని వ్యాఖ్యానించారు. కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకుంటూ.. విశ్వసనీయతను కాపాడుకుంటూ ఆకాశవాణి ఖ్యాతిని నిలబెట్టాలని కరస్పాండెంట్లకు సూచించారు. ఆకాశవాణి, హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగాధిపతి, డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎస్. మహేశ్ మాట్లాడుతూ.. 1957 ఫిబ్రవరి 7న ఆకాశవాణి వార్తా విభాగం ప్రారంభమైందని గుర్తు చేశారు. 1965లో ఉర్దూ శ్రోతలను దృష్టిలో ఉంచుకుని ఉర్దూ బులెటిన్ మొదలైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, ప్రముఖుల ఆధ్వర్యంలో పలు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. 'మారుతున్న మీడియా వాతావరణంలో వార్తల సేకరణ, కంటెంట్ రూపకల్పన' అంశంపై ఆర్టీఐ మాజీ కమిషనర్, పీపుల్స్ పల్స్ డైరెక్టర్ ఆర్ దిలీప్ రెడ్డి ప్రసంగించారు. 'సోషల్ మీడియా యుగంలో కంటెంట్ వినియోగం' అంశంపై ది హిందూ బిజినెస్ లైన్ అసోసియట్ ఎడిటర్ డాక్టర్ కూర్మనాథ్ అవగాహన కల్పించారు. 'న్యూస్ రూమ్ పరిణామం, కంటెంట్ ప్రసారం, మారుతున్న కంటెంట్ మూలాల స్వభావం' అంశంపై ఐ న్యూస్ సీఈవో, చీఫ్ ఎడిటర్ ఏకే సాగర్ విశ్లేషించారు. అలాగే, 'ఫ్యాక్ట్ చెక్, సోషల్ మీడియా హాండిల్లను మెరుగుపరిచేందుకు సోషల్ మీడియా పద్ధతులు' అంశంపై ఫ్యాక్ట్ లీ సంస్థ ఆపరేషన్స్ హెడ్ భరత్ మాట్లాడారు. మారుతున్న మీడియా పరిస్థితులలో ఆకాశవాణి విలేకరులకు ఈ శిక్షణ కార్యక్రమం సరికొత్తగా దిశానిర్దేశం చేసింది.




మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.




### భార్యపై కోపంతో
## కూతురి హత్య

**సపోటాపండులో**

**ఎలుకల మందు పెట్టి ఘాతుకం**

భువనగిరి, మార్చి 24 (ఈవార్తలు): యాదాద్రి భువనగిరి జిల్లాలో దారుణం జరిగింది. సంస్థాన్‌నారాయణపురం మండలం, లచ్చులగూడెంలో ఒక కసాయి తండ్రి సపోటా పండులో ఎలుకల మందుపెట్టి కన్నకూతురిని హతమార్చాడు. మూడు రోజులక్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వరికుప్పల రవికి మూడేళ్ల క్రితం స్వాతితో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు రెండేళ్ల మేఘన, తొమ్మిది నెలల మయూరి ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో స్వాతి తన చిన్నకూతురుతో కొద్దిరోజులుగా పుట్టింట్లో ఉంటోంది. పెద్ద కూతురు మేఘన తండ్రివద్ద ఉంటోంది. మేఘనను కూడా తన వద్దకు పంపించాలని స్వాతి కొద్దిరోజులుగా కోరుతోంది. భర్త ఎంతకూ పంపించకపోవడంతో ఆమె మాడ్గులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అక్కడి పోలీసులు నారాయణపురం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు రవిని పిలిపించి మాట్లాడారు. ఈ విషయం పెద్దమనుషుల మధ్య మాట్లాడుకోవాల్సి ఉంది. కానీ తండ్రి రవి మాత్రం కుమార్తెను కడతేర్చాలని నిర్ణయించుకున్నాడు. శనివారం సపోటా పండులో ఎలుకల మందుపెట్టి ఆమెకు తినమని చెప్పి ఇచ్చాడు. దీనితో కొద్దిసేపటికి వాంతులు చేసుకుని అపస్మారకస్థితిలోకి వెళ్లింది. ఆ తర్వాత భయంతో రవి కూడా నిద్రమాత్రలు, ఎలుకల మందు నీళ్లలో కలుపుకుని తాగగా, గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చిన్నారిని కూడా నీలోఫర్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. స్వాతి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు న్యాకో సురక్ష సంకల్ప్ కార్యశాల

## హెచ్ఐవీ నియంత్రణకు వర్క్ షాప్.. పాల్గొననున్న జిల్లా స్థాయి అధికారులు

హైదరాబాద్, మార్చి 24 (పీఐబీ): జాతీయ హెచ్ఐవీ నియంత్రణ చర్యలలో భాగంగా జిల్లా స్థాయి కార్యాచరణను వేగవంతం చేసేందుకు భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(న్యాకో) రాష్ట్రాలతో మరింత అనుసంధానమై పని చేస్తోంది. ఇందులో భాగంగా 'సురక్ష సంకల్ప్ కార్యశాల' పేరుతో మార్చి 25న హైదరాబాద్‌లో వర్క్‌షాప్ నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి న్యాకో అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాకేష్ గుప్తా అధ్యక్షత వహిస్తారు. "మిషన్ ఎయిడ్స్ సురక్ష" అనే విస్తృత కార్యక్రమంలో భాగంగా ఈ కార్యశాల జరుగుతోంది. సురక్ష సంకల్ప్ కార్యశాలల ద్వారా హెచ్ఐవీ ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో కార్యక్రమ అమలును బలోపేతానికి న్యాకో రాష్ట్రాలతో కలిసి పనిచేస్తోంది. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కార్యక్రమ నిర్వాహకులను, ప్రధాన భాగస్వాములను ఈ కార్యశాల ఏకతాటిపైకి చేర్చుతుంది. ఇందులో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ, జిల్లా కలెక్టర్లు, అదనపు జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్యారోగ్య అధికారులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారులు పాల్గొంటారు. తెలంగాణలో హెచ్ఐవీ ప్రాబల్యం 0.41 శాతంగా ఉండటం, హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో జీవిస్తున్న వారి సంఖ్య 1,56,961 ఉన్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టితో కూడిన ఈ విధానం కింద ప్రాధాన్యత కలిగిన రాష్ట్రంగా గుర్తించారు. కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేసేందుకు హైదరాబాద్, రంగారెడ్డి, ఖమ్మం, కరీంనగర్, నల్గొండ, సిద్దిపేట, మెదక్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, సూర్యాపేట, పెద్దపల్లి, జనగాం, వికారాబాద్, కామారెడ్డి, హనుమకొండ, సంగారెడ్డి, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి సహా 19 ప్రాధాన్యత జిల్లాలను గుర్తించారు. ఈ జిల్లాల ప్రతినిధులు కార్యశాలలో పాల్గొని తమ జిల్లాల పురోగతిని వివరిస్తారు. కార్యక్రమ అమలులో సవాళ్లపై చర్చిస్తారు. సేవలను మరింత మెరుగ్గా అందజేసేందుకు లక్షిత వ్యూహాలను రూపొందిస్తారు. హెచ్ఐవీ నివారణతో పాటు, నిర్ధారణకు పరీక్షా సేవలను మరింత మెరుగ్గా అందుబాటులోకి తేవడం, చికిత్సతో అనుసంధానం, చికిత్స కొనసాగేలా చూడటం, హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి మెరుగైన ఆరోగ్య ఫలితాలను అందించడంపై ప్రధాన దృష్టితో ఈ కార్యశాలలో చర్చలు జరుగుతాయి. జాతీయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయ చర్యలను చేపట్టడం ద్వారా ఈ కార్యశాలలు కార్యక్రమ అమలులో డేటా–ఆధారిత, వికేంద్రీకృత విధానాన్ని బలోపేతం చేస్తున్నాయి. ఈ కార్యక్రమం జాతీయ హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాల దిశగా పురోగతిని గణనీయంగా వేగవంతం చేస్తుందని, ప్రజారోగ్యానికి ముప్పుగా ఉన్న ఎయిడ్స్‌ను అంతం చేయాలనే భారతదేశ నిబద్ధతకు దోహదపడుతుందని భావిస్తున్నారు.

# హైదరాబాద్‌కు పీఐబీ భువనేశ్వర్ బృందం

**పీఐబీ, సీబీసీ హైదరాబాద్ ఏడీజీతో భేటీ**

హైదరాబాద్, మార్చి 24 (పీఐబీ): హైదరాబాద్ అధికారిక మీడియా పర్యటనలో భాగంగా భువనేశ్వర్‌లోని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) నేతృత్వంలోని 11 మంది మీడియా ప్రతినిధుల బృందం.. హైదరాబాద్‌లోని పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) శ్రుతి పాటిల్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశం సందర్భంగా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో భాగస్వామ్య వ్యూహాలకు ఉన్న ప్రాముఖ్యతను శ్రుతి పాటిల్ వారికి వివరించారు. ఈ నెల 27 వరకు జరగనున్న నాలుగు రోజుల మీడియా పర్యటనలో బృందం.. సికింద్రాబాద్‌లోని ఎన్ఐఈపీడీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిసేబిలిటీస్), విద్యానగర్‌లోని ఎన్ఎస్‌టీఐ (నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) వంటి ప్రతిష్టాత్మక సంస్థల సందర్శనలు చేయనుంది.



### ఇప్ప పువ్వు సారాతో
## లక్ష కోట్ల ఆదాయం

**అసెంబ్లీలో పూర్తి వివరాలు చెప్తా: అనిరుధ్ రెడ్డి**

హైదరాబాద్, మార్చి 24 (ఈవార్తలు): ఇప్ప పువ్వు సారాపై తనకున్న అవగాహనను తక్కువ అంచనా వేయవద్దని, దీనిపై అసెంబ్లీ వేదికగా రేపు పూర్తి వివరాలు వెల్లడిస్తానని కాంగ్రెస్ పార్టీ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్ చేసిన ఆయన, తనపై వస్తున్న సోషల్ మీడియా ట్రోల్స్‌కు తన ప్రసంగమే సమాధానం చెబుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేవలం వినోదం కోసం కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మార్చే శక్తి ఇప్ప పువ్వుకు ఉందని అన్నారు. గతంలో ఇప్ప పువ్వు సారా తాగిన వారు 115 ఏళ్లు ఆరోగ్యంగా బతికారని, కానీ ప్రస్తుతం వస్తున్న కల్తీ బ్రాండ్ల వల్ల ప్రజలు 60 ఏళ్లకే ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇప్ప పువ్వు సారాను శాస్త్రీయంగా ఉత్పత్తి చేసి మార్కెటింగ్ చేస్తే, రాష్ట్రానికి ఏకంగా రూ. లక్ష కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని ఆయన లెక్కలు వేశారు. దీనిని విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా గ్లోబల్ బ్రాండ్‌గా మార్చవచ్చని కూడా సూచించారు. అడవుల్లో ఇప్ప పువ్వు సేకరించే గిరిజన సోదరులు ఆర్థికంగా ఎదగాలంటే, ఇప్ప పువ్వు సారాకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించి ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. బుధవారం శాసనసభలో ఇప్ప పువ్వు సారా విధానంపై తాను ప్రసంగించబోతున్నానని, ఈ సారా తయారీ వెనుక ఉన్న శాస్త్రీయత, ఆర్థిక లాభాలను గణాంకాలతో సహా వివరిస్తానని అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. ట్రోల్స్ చేసే వారు తన ప్రసంగం విన్నాక అభిప్రాయం మార్చుకుంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# జీవన్ రెడ్డి కొత్త దారి

**40 ఏళ్ల కాంగ్రెస్ ప్రయాణానికి బైబై**


**రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు**

**కొత్త దిశ వైపు ఉత్తర తెలంగాణ**

**హాట్ టాపిక్‌గా జగిత్యాల పాలిటిక్స్**

జగిత్యాల రాజకీయాల్లో మరో కీలక మలుపు ఆవిర్భవించబోతుంది. ఇది కేవలం ఒక నాయకుడి పార్టీ మార్పు కథ కాదు.. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, నిబద్ధత, ఆశలు, అవమానాలు, ప్రాంతీయ రాజకీయాల లోతైన అంతర్గత పోరాటాల ప్రతిబింబం. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి తీసుకోబోయే నిర్ణయం వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తును మాత్రమే నిర్ణయించదు.. జగిత్యాల రాజకీయ దిశను, ఉత్తర తెలంగాణ శక్తి సమీకరణాలను, కాంగ్రెస్ , బీఆర్ఎస్ మధ్య పోటీతత్వాన్ని కొత్త దశలోకి తీసుకెళ్లే శక్తి కలిగిన పరిణామం ఇది.

ఈ నెల 25న బుధవారం తన కార్యకర్తలతో భారీ సమావేశం నిర్వహించి, తన రాజకీయ భవిష్యత్‌పై కీలక నిర్ణయం ప్రకటించనున్నారు. ఇది సాధారణ సమావేశం కాదు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌తో ముడిపడిన ఆయన రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మలుపు. పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన అసంతృప్తి, స్థానిక సమీకరణాల్లో ఏర్పడిన వివక్ష – ఇవన్నీ ఆయనను ఈ నిర్ణయానికి దారి తీశాయని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈనెల 24 మంగళవారం రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్.. జీవన్ రెడ్డిని బుజ్జగించడానికి జగిత్యాలలో భేటీ అయ్యారు. అయితే, తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. అంతకుముందు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జీవన్ రెడ్డిని బుజ్జగించడానికి వచ్చినా.. తాను కాంగ్రెస్ పార్టీలో నిలువగలిగే పరిస్థితులు లేవని ఖరాఖండిగా చెప్పేశారు. ఇప్పటి పరిస్థితుల్లో కాంగ్రెస్‌లో కొనసాగడం కుదరదని ఆయన ఇప్పటికే బహిరంగంగా ప్రకటించారు.



### రైతు కుటుంబం నుంచి రాజకీయ శిఖరాల వరకు

1951 జనవరి 5న జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికెపెల్లి గ్రామంలో జన్మించిన జీవన్ రెడ్డి సాధారణ రైతు కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగారు. న్యాయవాదిగా వృత్తి ప్రారంభించిన ఆయన 1981లో పంచాయతీ సమితి అధ్యక్షుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1983లో టీడీపీ తరపున జగిత్యాల నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఎన్టీఆర్ కేబినెట్‌లో ఎక్సైజ్ మంత్రిగా పని చేశారు. 1984లో కాంగ్రెస్‌లో చేరిన తర్వాత 1989 నుంచి 2004 వరకు పలుమార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేబినెట్‌లో రోడ్లు ఒ భవనాల మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్‌కు ఏకైక విజయం జగిత్యాల్లోనే సాధించిన ఘనత ఆయనది. 2019లో ఎమ్మెల్సీగా కూడా ఎన్నికయ్యారు. ఆరు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎమ్మెల్సీ, రెండు సార్లు మంత్రి – ఇది ఆయన రాజకీయ జీవితం సాధించిన స్థాయి. జగిత్యాల ప్రజలు జీవనన్నగా పిలిచే ఆయన స్థానిక సమస్యలు, రైతు అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించిన నాయకుడిగా ప్రసిద్ధి చెందారు.

### స్థానిక అసంతృప్తి నుంచి నిర్ణయం వరకు

2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఎదుర్కొన్న జీవన్ రెడ్డి, ఆ తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌తో సంబంధాలు దెబ్బతిన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు, చైర్‌పర్సన్ ఎంపికలో తన వర్గానికి తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం, పదవుల పంపకాల్లో ఏర్పడిన వివక్ష -- ఇవన్నీ ఆయనలో తీవ్ర అసంతృప్తిని కలిగించాయి. పార్టీ అధిష్టానానికి పలుమార్లు తన అభ్యంతరాలు తెలిపినా సమాధానం లభించకపోవడంతో ఆయన తన రాజకీయ భవిష్యత్‌పై పునరాలోచన చేశారు. గత 20 నెలలుగా తాను మానసిక క్షోభ, అవమానాలు భరిస్తున్నట్లు ఆయన ఇటీవలే బహిరంగ లేఖలో వెల్లడించారు. ఇప్పుడు ఆయన కార్యకర్తల సమావేశంలో తీసుకోనున్న నిర్ణయం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. కొన్ని రిపోర్టుల ప్రకారం ఆయన బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని, మరికొన్ని వర్గాలు ఇతర ఎంపికలను కూడా చర్చిస్తున్నట్లు తెలిపారు. ఆయన అనుచరులు ఇప్పటికే సోషల్ మీడియా డీపీలు మార్చుకోవడం, ఇంటి వద్ద ఫ్లెక్సీలు చించేయడం వంటి సంకేతాలు ఇస్తున్నాయి.

### రాజకీయ పరిణామాలు ఏమిటి?

జీవన్ రెడ్డి నిర్ణయం కాంగ్రెస్‌కు ఉత్తర తెలంగాణలో మరో ఎదురుదెబ్బగా మారే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే అంతర్గత అసంతృప్తులతో మల్లగుల్లాలుపడుతోంది. మరోవైపు బీఆర్ఎస్‌కు ఇది జగిత్యాలలో కొత్త బలం కలిగించే అవకాశం. కానీ రాజకీయ మార్పులు ఎప్పుడూ ఊహించని ట్విస్టులను తీసుకొస్తాయి. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత ఏ పార్టీలోకి వెళ్లినా, జగిత్యాల సమీకరణాలు పూర్తిగా మారిపోతాయి. మార్చి 25న జరగబోయే కార్యకర్తల సమావేశం ఒక నిర్ణయం ప్రకటించే వేదిక మాత్రమే కాదు.. ఇది తెలంగాణ రాజకీయాల్లో విలువల రాజకీయాలు వర్సెస్ అవకాశవాద రాజకీయాల మధ్య జరుగుతున్న మౌన పోరాటానికి ప్రతీకగా నిలుస్తుంది. ఒక వైపు నలభై ఏళ్ల విశ్వాసానికి ముగింపు పలకాల్సిన పరిస్థితి, మరోవైపు భవిష్యత్‌లో ప్రభావాన్ని నిలబెట్టుకోవాలనే రాజకీయ అవసరం, ఈ రెండు దారుల మధ్య నిల్చున్న జీవన్ రెడ్డి ఎంచుకునే మార్గం కేవలం ఆయనకే కాదు, ఆయనను నమ్ముకున్న వేలాది కార్యకర్తలకు, జగిత్యాల ప్రజలకు, , మొత్తం రాష్ట్ర రాజకీయాలకు దిశానిర్దేశం చేసే తీర్పుగా మారబోతోంది. ఈ పరిణామం ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది.. పార్టీలు మారినా, నాయకులు మారినా, ప్రజల ఆశలు మాత్రం మారవు. నాయకుల వ్యక్తిగత నిర్ణయాలు కంటే పెద్దది ప్రజల నమ్మకం. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే మార్గమే నిజమైన రాజకీయ విజయానికి ప్రమాణం. ఇక జీవన్ రెడ్డి తీసుకునే అడుగు.. చరిత్రలో ఒక అధ్యాయం ముగింపా? లేక కొత్త అధ్యాయం ఆరంభమా?.. అన్నది మరికొన్ని గంటల్లో స్పష్టమవుతుంది.

- కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్

నేడే ఈవార్తలు
బుధవారం 25-3-2026, జగిత్యాల



## ఏపీలో 61 రోజులు సముద్ర వేట నిషేధం

కాకినాడ, మార్చి 24 (ఈవార్తలు):ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు మొత్తం 61 రోజుల పాటు సముద్ర వేట నిషేధం అమలులోకి రానుంది. చేపల వంశవృద్ధి, సముద్ర జీవుల సంరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిషేధం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అమలులో ఉంటుంది. ఈ కాలంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఈ సమయంలో మత్స్యకారుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. మత్స్యకార సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, సాయం త్వరగా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఉప్పాడ ప్రజల భవిష్యత్తుపై నీలినీడలు

కాకినాడ, మార్చి 24 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా ఉప్పాడ తీరప్రాంతం కేవలం ఒక గ్రామం కాదు, మత్స్యకారుల జీవన ప్రపంచం. ప్రతి ఉదయం సముద్రంతో పోరాడుతూ జీవనం సాగించే వందలాది కుటుంబాల ఆశలు, ఆర్థిక స్థితి, భవిష్యత్తు దీనిపైనే ఆధారపడి ఉన్నాయి. ఉప్పాడలో మత్స్యకార జీవితం అనేది కష్టసాధ్యమైనదే అయినప్పటికీ, గత కొన్ని సంవత్సరాలుగా పరిస్థితులు మరింత క్లిష్టంగా మారుతున్నాయి. సముద్రంలో చేపల లభ్యత తగ్గిపోవడం మత్స్యకారులను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. పెద్ద యంత్ర పడవల ద్వారా అధిక వేట జరగడం, చిన్న మత్స్యకారులకు దెబ్బతీస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఇక పర్యావరణ సమస్యలు కూడా ఉప్పాడ తీరాన్ని వదలడం లేదు. సముద్ర తీరక్షయం ఈ ప్రాంతానికి పెద్ద సవాలుగా మారింది. సముద్రం క్రమంగా భూమిని ఆక్రమించుకుంటుండటంతో, మత్స్యకార గ్రామాలు భయాందోళనలో ఉన్నాయి. ఇది కేవలం భౌగోళిక సమస్య కాదు.. జీవనాధారంపై నేరుగా పడుతున్న ప్రభావం. చేపల వేటపై ప్రభుత్వాలు ప్రతి ఏడాది విధించే నిషేధ కాలం కూడా మత్స్యకారులకు ఒక పరీక్షగా మారుతోంది. శాస్త్రీయంగా ఇది అవసరమైన చర్య అయినప్పటికీ, ఆ కాలంలో ఆదాయం లేకపోవడం కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తోంది. ప్రభుత్వం అందించే సాయం సమయానికి, సరిపడా అందకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.

## జీవనోపాధిని తుంచేశారు!

**300 ఈత చెట్ల నరికివేత.. జగిత్యాల జిల్లా బొమ్మెనలో దారుణం**

కథలాపూర్, మార్చి 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామంలో గీత కార్మికుల జీవనాధారమైన ఈత చెట్లను భారీగా నరికివేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సుమారు 300 ఈత చెట్లను



ఒకేసారి నరికివేయడంతో తమ ఉపాధిని కోల్పోయామని గౌడ కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కూడా ఇలాంటి ఘటనే జరగగా, పోలీసులు కలుగజేసుకుని కుల వృత్తులకు ఆటంకం కలిగించవద్దని హెచ్చరించారు. అయితే, పాత కక్షలను మనసులో పెట్టుకుని ఈసారి మరింత పెద్ద ఎత్తున ఈ అకృత్యానికి పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. తమ మంచితనాన్ని బలహీనతగా తీసుకుని, కుల వృత్తిపై దాడి చేశారని గౌడ సంఘం ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, ఎక్సైజ్ అధికారులతో కలిసి సమగ్ర విచారణ చేపట్టాలని గీత కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేసి, వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా గీత కార్మిక సంఘం నాయకుడు యాగండ్ల రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. కుల వృత్తుల రక్షణ కోసం గౌడ సమాజం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఘటనపై ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని వెల్లడించారు.

## బీసీలపై కూటమి సర్కారు చిన్నచూపు

### బీసీ రక్షణ చట్టం తక్షణమే అమలు చేయాలి

**వైసీపీ విశాఖ జిల్లా బీసీ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్**



విశాఖపట్నం, మార్చి 24 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వంలో వెనుకబడిన తరగతుల (బీసీ) కులాలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రధానంగా నిర్లక్ష్యం, రాజకీయ దాడులు, కుతంత్రాలు మరియు సంక్షేమ చర్యలకు సంబంధించిన విషయాలుపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం విశాఖ జిల్లా అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం బీసీ సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు, బీసీ పరిరక్షణ చట్టం కోసం ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపాదనే తప్పా ఆచరణలో అలసత్వం పై ప్రశ్నించారు, బీసీ వర్గాల ప్రాథమిక అవసరాలను పట్టించుకోలేదని ఆరోపిస్తూ,రాజకీయ పోరాటాలలో బీసీ వర్గాలను పావులుగా వాడుకుంటూ వారి పైనే దాడులు చేస్తున్నారు అని అన్నారు రాష్ట్రంలోని బీసీ కులాల జీవితం, గౌరవం ప్రశ్నార్థకంగా మారుతోందని వారి సంక్షేమం పూర్తిగా ఈ కూటమి ప్రభుత్వం విస్మరించిందని చేనేత సహకార సంఘాలకు వాగ్దానం చేసిన పన్ను మినహాయింపులను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందడమే కాకుండా బీసీల కోసం వాగ్దానం చేసిన రూ.10,000 కోట్ల వార్షిక స్వయం ఉపాధి నిధిని పూర్తిగా అమలు చేయలేదని సనపల రవీంద్ర భరత్ విమర్శించారు.



## చిలూరు గంగమ్మకు న్యాయం చేయాలి

**చాపర్తి కుమార్ గాడ్గే డిమాండ్**

పాలకుర్తి, మార్చి 24 (ఈవార్తలు): జనగామ జిల్లా పాలకుర్తి మండలం చెన్నూరుకు చెందిన చిలూరు గంగమ్మకు ప్రభుత్వం న్యాయం చేయాలని రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తాసిల్దార్‌ను బాధిత కుటుంబంతో కలిసి.. చిలూరు గంగమ్మ కుటుంబానికి చెందిన 9 ఎకరాల భూమిని రిజర్వాయర్ పేరుతో మింగేశారని ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై విచారణ చేపట్టి అవినీతి వెలికి తీయాలని కోరారు. బాధితురాలి అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని గ్రామ బీఆర్ఎస్ నాయకుడు ఆ భూమిని కాజేశాడని తెలిపారు. ఇప్పటికి అనేక సార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని దుయ్యబట్టారు. ఎమ్మార్వోను కలిసిన వారిలో చిలూరు గంగమ్మ, మునయ్య, మాదరాజు యాకయ్య, పొలాస సోమన్న తదితరులు ఉన్నారు.



## చివరి మడి వరకు సాగునీరు

**పంటలు ఎండిపోకుండా కాపాడుకుంటాం**

**రైతులు ఆందోళన చెందవద్దు: మేడిపల్లి సత్యం**

చొప్పదండి, మార్చి 24 (ఈవార్తలు): చొప్పదండి నియోజకవర్గం లోని రైతులెవ్వరు ఆందోళన చెందవద్దని, చివరి మడి వరకు సాగునీరు అందించి పంటలు ఎండిపోకుండా కాపాడుకుంటామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. మంగళవారం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఈఎన్సీ రమేశ్ బాబును హైదరాబాదులోని వారి కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మర్యాదపూర్వకంగా కలిశారు. గాయత్రి పంపు హౌస్ నుండి వరద కాలువకు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వర్ధకాలువకు నీటిని విడుదల చేయాలని ఈఎన్సి ఆదేశించారు. మంత్రి ఆదేశాల ఎల్లుండి గాయత్రి పంప్ హౌస్ నుండి వరద కాలువకు నీటిని విడుదల చేస్తామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎమ్మెల్యే సత్యం కు హామీ ఇచ్చారు. రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకొని వర్ధకాలువకు నీటిని విడుదల చేయడానికి ఆదేశాలు జారీచేసిన మంచి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే సత్యం కృతజ్ఞతలు తెలిపారు.

## కాకినాడ జీజీహెచ్‌లో జీతాల గోడు!

**సెక్యూరిటీ, శానిటేషన్ కార్మికుల ఆందోళన**

కాకినాడ మార్చి 24 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్ కార్మికుల జీతాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ కాకినాడ నగర కమిటీ పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలో సీఐటీయూ కాకినాడ నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ.. జీజీహెచ్‌లో పనిచేసే సెక్యూరిటీ శానిటేషన్ కార్మికుల ఫిబ్రవరి నెల జీతాలను నేటికీ చెల్లించలేదని అన్నారు. అధికారులు కలుగజేసుకుని కార్మికులకు జీతాలు త్వరగా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్టర్ జీతం ఇవ్వకపోతే ప్రిన్సిపల్ ఎంప్లాయ్ హోదాలో కాంట్రాక్టర్‌తో జీతం ఇప్పించే బాధ్యత ఆసుపత్రి సూపరింటెండెంట్‌దేనని స్పష్టం చేశారు.

## ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి: బీఆర్ఎస్వీ

ఇబ్రహీంపట్నం, మార్చి 24 (ఈవార్తలు): విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్వీ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, గద్దెనెక్కి 27 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. ఇటు విద్యార్థులను, అటు నిరుద్యోగ యువతను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ మోసాన్ని ఖండిస్తూ మంగళవారం చేపట్టిన 'అసెంబ్లీ ముట్టడి' నేపథ్యంలో ఆయనను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విడుదలైన అనంతరం ఆయన మాట్లాడుతూ.. అరెస్టులతో ప్రతిపక్షాల గొంతు నొక్కలేరని స్పష్టం చేశారు.

# చేనేత అభివృద్ధికి కేంద్రం చర్యలు

**గత ఐదేళ్లలో కాకినాడ జిల్లాకు 91.87 లక్షలు మంజూరు.. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్రమంత్రి జవాబు**

కాకినాడ, మార్చి 24 (ఈవార్తలు): చేనేతరంగాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడంతో పాటు, చేనేత కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కేంద్ర టెక్స్ టైల్స్ శాఖామంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో చేనేత రంగం అభివృద్ధికి కేంద్రం తీసుకున్న చర్యలు, హ్యాండ్లూమ్ క్లస్టర్ కు కేటాయించిన నిధుల వివరాలపై మంగళవారం కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. చేనేత రంగం అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం 'కేంద్రం నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ ప్రోగ్రాం( ఎన్ హెచ్ డి పి)' పథకం అమలు చేస్తుందన్నారు, ఈ పథకం ద్వారా అర్హులైన హ్యాండ్లూమ్ ఏజెన్సీలు, చేనేత కార్మికులకు ఆధునిక లూమ్స్, ఉపకరణాల కొనుగోలు, వర్క్ షెడ్ల నిర్మాణం, సాంకేతిక సహాయం, సౌర దీపాలు అందించడంతో పాటు దేశీయ,అంతర్జాతీయ మార్కెట్లలో చేనేత ఉత్పత్తులు మార్కెటింగ్ సౌకర్యం, ముద్ర రుణాలు అందిస్తున్నామని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ లో 44 హ్యాండ్లూమ్ క్లస్టర్స్ కు 19. 47 కోట్లు మంజూరు చేయగా, 10,047 మంది చేనేత కార్మికులు లబ్ధి పొందారని తెలిపారు. ఇందులో ఏపీలో కాకినాడ జిల్లాలో గొల్లప్రోలులో హ్యాండ్లూమ్ క్లస్టర్స్ కు 30.04 లక్షల మంజూరు చేయగా, 595 మంది చేనేత కార్మికులు, పెద్దాపురంలో హ్యాండ్లూమ్ క్లస్టర్ కు 18.47 లక్షలు మంజూరు చేయగా 92 మంది చేనేత కార్మికులు, ప్రత్తిపాడులో హ్యాండ్లూమ్ క్లస్టర్స్ కు 43.36 లక్షల మంజూరు చేయగా 378 మంది చేనేత కార్మికులు లబ్ధి పొందారని కేంద్ర మంత్రి తెలిపారు. ఐదేళ్ల కాల పరిమితి గల నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ ప్రోగ్రాం పథకం ఈ ఏడాది మార్చి తో ముగుస్తున్నందున ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో హ్యాండ్లూమ్ క్లస్టర్ కు చివర విడత నిధులు మంజూరుకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్రమంత్రి బదులిచ్చారని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.



## అంజన్న జన్మోత్సవాల ఏర్పాట్లపై పరిశీలన

మల్యాల, మార్చి 24 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కొండగట్టు ఆలయ పరిసరాల్లో నిర్వహించనున్న జయంతి ఉత్సవాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఏర్పాట్లను ప్రత్యక్షంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని భావించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా, పార్కింగ్ సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని అధికారులకు సూచించారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రాజాగౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీపీవో మదన్ మోహన్, ఆలయ ఈవో అంజనారెడ్డి, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



## ఎన్నారై శశియాదవ్‌కు శుభాకాంక్షల వెల్లువ

కాకినాడ, మార్చి 24 (ఈవార్తలు): ఎన్నారై శశియాదవ్‌కు ప్రజలు, జనసేన కార్యక్తల నుంచి జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు, కార్యకర్తలు తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞుడిని అని తెలిపారు. త్వరలోనే మళ్లీ పిఠాపురం వస్తానని, అందరినీ ప్రత్యేకంగా కలుస్తానని పేర్కొన్నారు.







PUBLIC NOTICE

మహర్ష గ్రూప్ సంస్థలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. గత కొన్ని సంవత్సరాలుగా మహర్ష గ్రూప్ సంస్థలకు డైరెక్టర్‌గా పనిచేసి, గత రెండు సంవత్సరాలుగా కంపెనీకి దూరంగా ఉంటున్నాను. సోమవారం (23 మార్చి 2026) రోజున కంపెనీ డైరెక్టర్‌గా రాజీనామా చేశాను. కాబట్టి కంపెనీ లావాదేవీలకు, నాకు ఎలాంటి సంబంధం లేదని తెలుపుతున్నా. కస్టమర్లు, ఏజెంట్లు ఇది గమనించగలరు. ఏదైనా ఉంటే కంపెనీ యజమాన్యంతో మాట్లాడుకోవాలని విన్నవిస్తున్నా.

- గుండెబోయిన వెంకటేశ్వర్లు (చిన్న)

# బంగ్లాలో తీవ్ర ఆహార ద్రవ్యోల్బణం

## మూడేళ్లుగా 'రెడ్' కేటగిరీలోనే



ఢాకా: పొరుగు దేశం బంగ్లాదేశ్‌ను తీవ్రమైన ఆహార ద్రవ్యోల్బణం పట్టి పీడిస్తోంది. దాదాపు మూడేళ్లుగా ఆ దేశం, ఆహార ద్రవ్యోల్బణ ప్రమాదం అధికంగా ఉన్న దేశాల 'రెడ్' కేటగిరీ నుంచి బయటపడలేకపోతోంది. ప్రభుత్వం మధ్యంతరంగా కొన్ని చర్యలు తీసుకోవడంతో మొత్తం ద్రవ్యోల్బణం కాస్త తగ్గినా, గత ఐదు నెలలుగా ఆహార వస్తువుల ధరలు మళ్లీ పెరగడం ఆందోళన కలిగిస్తోందని బంగ్లాదేశ్ మీడియాలో వచ్చిన ఒక కథనం పేర్కొంది. ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదికలో కూడా బంగ్లాదేశ్ 'రెడ్' కేటగిరీలోనే ఉన్న విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. గత 10 నెలలుగా ఆ దేశంలో ఆహార ద్రవ్యోల్బణం అత్యధిక స్థాయిలో కొనసాగుతోందని నివేదిక స్పష్టం చేసింది. దీని అర్థం బంగ్లాదేశ్‌లో ఆహార అభద్రత ముప్పు ఏమాత్రం తగ్గలేదని, పైగా ప్రస్తుతం కొనసాగుతున్న మధ్యప్రాచ్య సంక్షోభం కారణంగా ఇది మరింత పెరిగే అవకాశం ఉందని ఢాకాకు చెందిన 'ప్రథమ్ ఆలో' పత్రిక విశ్లేషించింది. ఈ జాబితాలో బంగ్లాదేశ్‌తో పాటు మరో 13 దేశాలు (ఇథియోపియా, మొజాంబిక్, అంగోలా, ఘనా, రష్యా, ఉక్రెయిన్ తదితర దేశాలు) కూడా ఉన్నాయి. ఆహార ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో పెరగడం చాలా ఆందోళనకరమని ప్రైవేట్ పరిశోధనా సంస్థ 'సౌత్ ఏషియన్ నెట్‌వర్క్ ఆన్ ఎకనామిక్ మోడలింగ్' (ఎస్ఏఎన్ఈఎం) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సెలిమ్ రైహాన్ అన్నారు. మధ్యప్రాచ్య సంక్షోభం ఇలాగే కొనసాగితే, అది దేశ దిగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఫలితంగా ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. పొరుగు దేశాలతో పోలిస్తే ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంలో బంగ్లాదేశ్ చాలా వరకు విఫలమైందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఏజెన్సీల ప్రకారం ద్రవ్యోల్బణం 8.5 శాతం నుంచి 9 శాతం మధ్య ఉందని చెబుతున్నప్పటికీ, వాస్తవానికి ఇది ఇంకా ఎక్కువగానే ఉందని నివేదికలు చెబుతున్నాయి. బంగ్లాదేశ్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (బీబీఎస్) ప్రకారం, ఫిబ్రవరిలో ఆహార ద్రవ్యోల్బణం 9.3 శాతంగా నమోదైంది. ఇది గత 13 నెలల్లో అత్యధికం. గత మూడేళ్లకు పైగా ఆహార ద్రవ్యోల్బణం ఇంత అధిక స్థాయిలో కొనసాగడం ఇదే తొలిసారి. పేద, పరిమిత ఆదాయ వర్గాల ప్రజలు ఇంత సుదీర్ఘకాలం పాటు కష్టాలను ఎప్పుడూ ఎదుర్కోలేదని నిపుణులు అంటున్నారు. పేద ప్రజల ఆదాయంలో మూడింట రెండొంతుల వరకు ఆహారానికే ఖర్చవుతుంది. దీంతో ధరల పెరుగుదల భారం వారినే ఎక్కువగా దెబ్బతీస్తోంది. ప్రపంచ బ్యాంకు జాబితాలోని ఇతర దేశాలు గత ఏడాది కాలంలో రెడ్, పర్పుల్, యెల్లో, గ్రీన్ కేటగిరీల మధ్య మారుతుండగా, బంగ్లాదేశ్ మాత్రం 'రెడ్' కేటగిరీలోనే స్థిరంగా ఉండిపోవడం అక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

## పెరంబూర్ నుంచి విజయ్ ఎన్నికల ప్రచారం

చెన్నై: తమిళనాడు రాజకీయాలు వేడెక్కుతున్న వేళ, నటుడు-రాజకీయ నేత విజయ్ తన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. బుధవారం నుంచి చెన్నైలోని పెరంబూర్ నియోజకవర్గంలో ఆయన తన ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఆయన స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతుండటంతో ఈ పరిణామం సర్వత్రా ఆసక్తి రేపుతోంది. ప్రచార కార్యకలాపాల కోసం విజయ్ ఇప్పటికే కొడుంగైయూర్ సమీపంలోని కన్నదాసన్ నగర్‌లో ఒక బంగ్లాను సిద్ధం చేసుకున్నారు. రేపు ఉదయం ఆ నివాసంలో పూజలు నిర్వహించి, అనంతరం పెరంబూర్ నియోజకవర్గంలో పర్యటనకు బయలుదేరనున్నారు. రాబోయే రెండు రోజుల పాటు ఆయన స్థానికులతో మమేకమవుతూ, ఓటర్లను కలిసి మద్దతు కోరనున్నారు. తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా, ఈ నెల 30 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో డీఎంకే, అన్నాడీఎంకే, ఎన్డీఏ వంటి ప్రధాన కూటములు అభ్యర్థుల ఎంపిక, పొత్తులు, మేనిఫెస్టో రూపకల్పనపై కసరత్తు ముమ్మరం చేశాయి. ఈసారి తమిళనాట ఎన్నికలు చతుర్ముఖ పోటీగా మారే అవకాశం కనిపిస్తోంది. డీఎంకే, అన్నాడీఎంకే కూటములతో పాటు నామ్ తమిళ్ కట్చి (ఎన్‌టీకే), విజయ్ నేతృత్వంలోని టీవీకే కూడా స్వతంత్రంగా పోటీ చేసే సూచనలు ఉన్నాయి. విజయ్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించడం, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల సరళిని ప్రభావితం చేయవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇరాన్‌పై విచారణ తప్పదు: హ్యూమన్ రైట్స్ వాచ్

న్యూఢిల్లీ: హర్మూజ్ జలసంధి, దాని పరిసర ప్రాంతాల్లో ప్రయాణించే నౌకలపై ఇరాన్ ఉద్దేశపూర్వకంగా దాడులు చేసిందని హ్యూమన్ రైట్స్ వాచ్ పేర్కొంది. తద్వారా ఇరాన్ యుద్ధ చట్టాలను ఉల్లంఘించిందని తెలిపింది. గత నెల 28న ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం ప్రారంభమైంది. ఆ తర్వాత హర్మూజ్ జలసంధి, సమీపంలోని నౌకలు లక్ష్యంగా ఇరాన్ దళాలు దాడులు చేశాయి. ఈ దాడులు చేసింది తామేనని ఇరాన్ అధికారులు కూడా ప్రకటించిన విషయాన్ని హ్యూమన్ రైట్స్ వాచ్ గుర్తు చేసింది. వీటిని పౌర వాణిజ్య నౌకలుగా గుర్తించినట్లు వెల్లడించింది. యుద్ధంలో పౌరులు, వారి మౌలిక సదుపాయాలపై ప్రత్యక్ష దాడులు చేయడం అంతర్జాతీయ మానవతా హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఉల్లంఘనలకు పాల్పడిన వారు విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అమెరికాకు చెందిన సేఫ్‌సీ విష్ణు, థాయ్‌లాండ్‌లోని షిప్పింగ్ కంపెనీకి చెందిన మయూరి నారీ అనే రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ దళాలు మార్చి 11వ తేదీన దాడి చేసిన విషయం తెలిసిందే. దాడులకు పాల్పడింది తామేనని ఇరాన్ అధికారులు ప్రకటించారు. ఇందుకు సంబంధించి వీడియోలు, ఫొటోలను కూడా పోస్టు చేశారు. ఈ విషయాలను గుర్తు చేసిన హ్యూమన్ రైట్స్ వాచ్, ఇరాన్ యుద్ధ చట్టాలను ఉల్లంఘించిందని ఆరోపించింది. ఈ నెల 1 నుంచి 17వ తేదీ మధ్య కాలంలో హర్మూజ్ జలసంధి, పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లలో మొత్తం 16సార్లు దాడులు జరిగినట్లు తెలిపింది. దీనితో మొత్తం 17 వాణిజ్య నౌకలకు నష్టం వాటిల్లినట్లు తెలిపింది. ఈ ఘటనల్లో మొత్తం ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, పదిమంది గాయపడ్డారని, నలుగురు గల్లంతయ్యారని తెలిపింది. ఇరాన్ ఉద్దేశపూర్వకంగా ఈ దాడులు చేసిందని, కానీ ఇవి పౌర వాణిజ్య నౌకలుగా గుర్తించినట్లు తెలిపింది.

# ఆటలాడితే పైసలొస్తున్నయ్!

**భారత క్రీడా ఆర్థిక వ్యవస్థకు భారీ ఆదాయం.. క్రీడా చరిత్రలోనే సరికొత్త రికార్డు.. క్రికెట్‌దే అధిక వాటా**



న్యూఢిల్లీ: భారత క్రీడా ఆర్థిక వ్యవస్థ చరిత్రలో తొలిసారిగా సరికొత్త మైలురాయిని అధిగమించింది. 2025లో మొదటిసారిగా 2 బిలియన్ డాలర్ల మార్కును దాటి, మొత్తం 2.13 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.18,864 కోట్లు) చేరుకుంది. గత ఏడాదితో పోలిస్తే ఇది 13.4 శాతం వృద్ధి. కేవలం నాలుగేళ్లలో ఈ రంగం రెట్టింపు పరిమాణానికి విస్తరించడం విశేషం. అయితే ఈ అద్భుతమైన వృద్ధిలో సింహభాగం ఒక్క క్రికెట్‌దే కావడం గమనార్హం. ప్రముఖ మీడియా సంస్థ డబ్ల్యూపీపీ తన 'స్పోర్టింగ్ నేషన్: బిల్డింగ్ ఏ లెగసీ' నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. ఈ వివరాలను ప్రధానమంత్రి కార్యాలయం సోషల్ మీడియాలో పంచుకుంది. దేశ క్రీడా రంగం మొత్తం ఆదాయంలో క్రికెట్ వాటా ఏకంగా 89 శాతంగా నమోదైంది. 2024లో 85 శాతంగా ఉన్న ఈ వాటా మరింత పెరిగింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, 2025లో కేవలం క్రికెట్ ద్వారానే రూ.16,704 కోట్ల ఆదాయం రాగా, ఇది 2024లోని మొత్తం భారత క్రీడా ఆర్థిక వ్యవస్థ (రూ.16,633 కోట్లు) కంటే ఎక్కువ. అంటే, మిగతా క్రీడలన్నీ కలిపి కూడా క్రికెట్ దరిదాపుల్లోకి రాలేకపోయాయి. డబ్ల్యూపీపీ నివేదిక ప్రకారం, ఈ మొత్తం విలువను మూడు ప్రధాన ఆదాయ వనరుల ఆధారంగా లెక్కించారు. మీడియా ప్రకటనల ఖర్చుల రూపంలో అత్యధికంగా రూ.9,571 కోట్లు రాగా, ఇందులో 95 శాతం (రూ.9,026 కోట్లు) వాటా ఒక్క క్రికెట్‌దే. స్పాన్సర్‌షిప్ (గ్రౌండ్, టీమ్, ఫ్రాంచైజీ ఫీజులు) ద్వారా రూ.7,943 కోట్లు సమకూరగా, ఇందులో క్రికెట్ వాటా 81 శాతంగా ఉంది. ఒక్క ఐపీఎల్ టీమ్‌ల స్పాన్సర్‌షిప్ విలువే రూ.1,000 కోట్లు దాటింది. ఇక అథ్లెట్ ఎండార్స్‌మెంట్ల ద్వారా వచ్చిన రూ.1,350 కోట్లలో 87 శాతం క్రికెటర్లకే దక్కింది. ఐపీఎల్ ఘనవిజయం, భారత జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడం, మహిళల వన్డే ప్రపంచకప్ విజయం, మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వంటివి క్రికెట్ వృద్ధికి మరింత ఊతమిచ్చాయి. ఒకవైపు క్రికెట్ 17.9 శాతం వృద్ధి నమోదు చేయగా, ఫుట్‌బాల్, కబడ్డీ వంటి ఇతర 'ఎమర్జింగ్ స్పోర్ట్స్' ఆదాయం 12.2 శాతం తగ్గింది. దీంతో మొత్తం క్రీడా ఆదాయంలో వాటి వాటా 11 శాతానికి పడిపోయింది. ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నీ వాయిదా పడటం దీనికి ప్రధాన కారణంగా నివేదిక పేర్కొంది. 2024లో పారిస్ ఒలింపిక్స్ వల్ల ఇతర క్రీడలపై ఆసక్తి పెరిగినా, 2025లో అలాంటి ప్రధాన ఈవెంట్లు లేకపోవడం కూడా ప్రభావం చూపింది. "భారత్ ప్రపంచ క్రికెట్‌కు యాంకర్ మార్కెట్‌గా ఉంది. ఇక్కడ మహిళల క్రికెట్‌పై పెరుగుతున్న ఆసక్తి భవిష్యత్తులో మరింత వృద్ధికి కారణమవుతుంది" అని ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా అన్నారు. డబ్ల్యూపీపీ మీడియా సౌత్ ఏషియా ఎండీ వినిత్ కర్నిక్ మాట్లాడుతూ, "క్రీడలు ఇప్పుడు సంస్కృతి, వాణిజ్యం మధ్య వారధిగా మారాయి. బ్రాండ్లు కేవలం స్పాన్సర్లుగా మిగిలిపోకుండా, కార్యాచరణలో భాగమవుతున్నాయి" అని విశ్లేషించారు. సోషల్ మీడియాలో కూడా క్రికెటర్ల ప్రభావమే ఎక్కువగా ఉంది. ఒక నివేదిక ప్రకారం విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల సోషల్ మీడియా ఎంగేజ్‌మెంట్‌తో పోలిస్తే నీరజ్ చోప్రా, సునీల్ ఛెత్రి వంటి ఇతర క్రీడాకారులు చాలా వెనుకబడి ఉన్నారు. మొత్తం మీద, ఈ నివేదిక భారత క్రీడా రంగంలో క్రికెట్ తిరుగులేని స్థానాన్ని స్పష్టం చేస్తోంది. మిగతా క్రీడలు నిలదొక్కుకోవాలంటే భారీ పెట్టుబడులు, మీడియా మద్దతు అత్యవసరమని స్పష్టమవుతోంది.

## పాకి.. అంతా మురికి!

**కాలుష్యంలో పాకిస్థాన్ టాప్.. ప్రపంచంలోనే అత్యంత కలుషిత దేశం**

జెనీవా: వాయు కాలుష్యంలో పాకిస్థాన్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2025 సంవత్సరానికి గానూ ప్రపంచంలోనే అత్యంత కాలుష్యభరిత పొగమంచుతో కూడిన దేశంగా పాకిస్థాన్ నిలిచినట్టు స్విట్జర్లాండ్‌కు చెందిన వాయు నాణ్యత పర్యవేక్షణ సంస్థ 'ఐక్యూఎయిర్' తన వార్షిక నివేదికలో వెల్లడించింది. ఇక్కడి గాలిలో ప్రమాదకరమైన సూక్ష్మ రేణువుల సాంద్రత ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నిర్దేశించిన సురక్షిత స్థాయి కంటే 13 రెట్లు అధికంగా ఉన్నట్టు నివేదిక స్పష్టం చేసింది. తాజాగా విడుదలైన ఈ నివేదిక ప్రకారం 2025లో ప్రపంచవ్యాప్తంగా 143 దేశాలు, ప్రాంతాల్లో వాయు నాణ్యతను పర్యవేక్షించగా.. వాటిలో 130 దేశాలు డబ్ల్యూహెచ్ఓ నిర్దేశించిన ప్రమాణాలను అందుకోలేకపోయాయి. డబ్ల్యూహెచ్ఓ ప్రకారం, గాలిలో పీఎం 2.5 రేణువుల సాంద్రత ఒక క్యూబిక్ మీటరుకు 5 మైక్రోగ్రాముల కంటే తక్కువగా ఉండాలి. అయితే, పాకిస్థాన్ తర్వాత బంగ్లాదేశ్, తజికిస్థాన్ దేశాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. 2024లో అత్యంత కాలుష్య దేశంగా ఉన్న చాద్, ఈసారి నాలుగో స్థానానికి పడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం 14 శాతం నగరాలు మాత్రమే 2025లో డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలకు అనుగుణంగా స్వచ్ఛమైన గాలిని కలిగి ఉన్నాయి. ఆస్ట్రేలియా, ఐస్‌లాండ్, ఎస్టోనియా, పనామా సహా మొత్తం 13 దేశాలు మాత్రమే సురక్షితమైన గాలిని కలిగి ఉన్నట్టు నివేదిక పేర్కొంది. మరోవైపు, లావోస్, కంబోడియా, ఇండోనేషియా వంటి దేశాల్లో 'లా నినా' వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షాలు, గాలులు ఎక్కువగా ఉండటంతో గతేడాదితో పోలిస్తే పీఎం 2.5 స్థాయిలు తగ్గాయి. మొత్తం 75 దేశాల్లో కాలుష్య స్థాయిలు తగ్గగా, 54 దేశాల్లో పెరిగాయి. గతంలో కూడా పాకిస్థాన్ అత్యంత కాలుష్య దేశాల జాబితాలో ఉండేది. ముఖ్యంగా శీతాకాలంలో లాహోర్, కరాచీ వంటి ప్రధాన నగరాలు పొగమంచు, పారిశ్రామిక ఉద్గారాలతో తీవ్రమైన వాయు కాలుష్య సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. .

## పిన్ లేకుండానే యూపీఐ పేమెంట్లు

**భీమ్ యాప్‌లో సరికొత్త ఫీచర్**

న్యూఢిల్లీ: యూపీఐ చెల్లింపులను మరింత సులభతరం, వేగవంతం చేసే దిశగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక ముందడుగు వేసింది. ఎన్‌పీసీఐకు చెందిన ఎన్‌పీసీఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎన్‌బీఎస్ఎల్), మంగళవారం భీమ్ పేమెంట్స్ యాప్‌లో సరికొత్త బయోమెట్రిక్ అథెంటికేషన్ ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ఈ కొత్త అప్‌డేట్ ద్వారా వినియోగదారులు రూ. 5,000 వరకు జరిపే లావాదేవీలకు తమ స్మార్ట్‌ఫోన్‌లోని వేలిముద్ర (ఫింగర్‌ప్రింట్) లేదా ఫేషియల్ రికగ్నిషన్ ఉపయోగించి సులభంగా ఆమోదం తెలపవచ్చు. ఈ ఫీచర్‌తో ప్రతి చిన్న లావాదేవీకి యూపీఐ పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం ఉండదు. చాలా సందర్భాల్లో పిన్ మర్చిపోవడం లేదా తప్పుగా నమోదు చేయడం వల్ల చెల్లింపులు విఫలమవుతుంటాయి. ఈ కొత్త విధానం ద్వారా అలాంటి ఇబ్బందులకు తెరపడుతుందని, చెల్లింపుల ప్రక్రియ మరింత సౌకర్యవంతంగా మారుతుందని ఎన్‌బీఎస్ఎల్ విశ్వాసం వ్యక్తం చేసింది. స్నేహితులు, కుటుంబ సభ్యులకు డబ్బు పంపడం, షాపుల్లో క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయడం, ఆన్‌లైన్ చెల్లింపులు వంటి రోజువారీ లావాదేవీలన్నింటికీ ఈ బయోమెట్రిక్ ఆప్షన్‌ను ఉపయోగించుకోవచ్చు. ఈ సందర్భంగా ఎన్‌బీఎస్ఎల్ ఎండీ, సీఈవో లలితా నటరాజ్ మాట్లాడుతూ.. డిజిటల్ చెల్లింపులను అందరికీ సులభంగా, సురక్షితంగా అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు. "వినియోగదారులు తమ వేలిముద్ర లేదా ఫేస్ అన్‌లాక్ ద్వారా లావాదేవీలను నిర్ధారించడం వల్ల పిన్‌పై ఆధారపడటం తగ్గుతుంది. అదే సమయంలో చెల్లింపులు యూజర్ బయోమెట్రిక్‌తో ముడిపడి ఉండటం వల్ల బలమైన భద్రత కూడా కొనసాగుతుంది" అని ఆమె వివరించారు. బయోమెట్రిక్ డేటా వినియోగదారుడి ఫోన్‌లోనే సురక్షితంగా నిల్వ ఉండటం వల్ల పిన్ షేరింగ్ వంటి ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు. అయితే, భద్రత దృష్ట్యా రూ. 5,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీలకు మాత్రం వినియోగదారులు తప్పనిసరిగా యూపీఐ పిన్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఇది పెద్ద మొత్తంలో జరిగే చెల్లింపులకు అదనపు రక్షణ కల్పిస్తుంది. ప్రస్తుతం ఈ ఫీచర్.. ఫింగర్‌ప్రింట్ లేదా ఫేషియల్ రికగ్నిషన్ సపోర్ట్ చేసే ఆండ్రాయిడ్, ఐఓఎస్ స్మార్ట్‌ఫోన్లలో అందుబాటులోకి వచ్చింది.

## పురుషులకూ ఉచిత బస్సు

చెన్నై: తాము అధికారంలోకి వస్తే పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి ఉచితంగా ఫ్రిజ్ ఇస్తామని అన్నాడీఎంకే తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో డీఎంకే, టీవీకే పార్టీలు వరుసగా తమ మేనిఫెస్టోలను ప్రకటిస్తున్నాయి. తాజాగా అన్నాడీఎంకే తన ఎన్నికల హామీలను విడుదల చేసింది. రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉచితంగా ఫ్రిజ్‌లు ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. మహిళలతో పాటు పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని తెలిపింది. 5 లక్షల మంది మహిళా ఉద్యోగులకు రూ.25 వేల రాయితీతో ద్విచక్ర వాహనాలు అందిస్తామని ప్రకటించింది. బ్యాంకుల నుంచి తీసుకున్న విద్యా రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం ఇస్తామని తెలిపింది. రేషన్ కార్డు ఉన్న వారికి బియ్యంతో పాటు ఉచితంగా కిలో పప్పు, కిలో మంచినూనె అందజేస్తామని తన మేనిఫెస్టోలో పేర్కొంది. సంవత్సరానికి ఒక కుటుంబానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, సామాజిక భద్రతా పెన్షన్ రూ.2 వేలకు పెంపు, జల్లికట్టు యోధుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం వంటి హామీలను కూడా పొందుపరిచింది.

## సైన్యంలో మహిళలకు శాశ్వత కమిషన్

**సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు**

న్యూఢిల్లీ: భారత సైన్యంలో పనిచేస్తున్న మహిళా అధికారులకు సంబంధించి సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. పురుష అధికారులతో సమానంగా మహిళా అధికారులకు కూడా శాశ్వత కమిషన్ (పర్మనెంట్ కమిషన్) పొందే అర్హత ఉందని స్పష్టం చేసింది. శారీరక సామర్థ్యం లేదా ఇతర సామాజిక కారణాలను చూపి వారికి ఈ అవకాశాన్ని నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని తేల్చి చెప్పింది. ఈ తీర్పుతో షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ద్వారా సైన్యంలో చేరిన మహిళా అధికారులు కూడా పదవీ విరమణ వయసు వరకు సర్వీసులో కొనసాగేందుకు మార్గం సుగమమైంది. దీనివల్ల వారు పురుష సహోద్యోగులతో సమానంగా పదోన్నతులు, పెన్షన్, ఇతర ఆర్థిక ప్రయోజనాలను అందుకుంటారు. సైన్యంలో లింగ వివక్షను రూపుమాపాల్సిన అవసరం ఉందని, మహిళల నైపుణ్యాన్ని, దేశ సేవలో వారి అంకితభావాన్ని గుర్తించాలని న్యాయస్థానం ప్రభుత్వానికి సూచించింది. ఈ నిర్ణయంపై రక్షణ రంగ నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పరిపాలన నుంచి క్షేత్రస్థాయి విధుల వరకు మహిళలు తమ సామర్థ్యాన్ని నిరూపించుకుంటున్నారని, ఈ తీర్పు భవిష్యత్తులో మరింత మంది మహిళలు సైన్యంలో చేరేందుకు ప్రోత్సాహాన్ని ఇస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.



## టీబీకి ఆయుర్వేద మందు!

**తొలి క్లినికల్ స్టడీ ప్రారంభం.. వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం**

న్యూఢిల్లీ: ప్రపంచ క్షయవ్యాధి (టీబీ) దినోత్సవం సందర్భంగా భారత్ ఒక కీలక ముందడుగు వేసింది. టీబీకి అందించే ప్రామాణిక చికిత్స (ఏటీటీ)కు అదనంగా ఆయుర్వేదాన్ని ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలపై శాస్త్రీయంగా అధ్యయనం చేసేందుకు ప్రపంచంలోనే తొలి క్లినికల్ స్టడీని ప్రారంభించినట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. మంగళవారం ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. బయోటెక్నాలజీ విభాగం, ఆయుష్ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఎనిమిది సంస్థలలో, కొత్తగా క్షయ వ్యాధి నిర్ధారణ అయిన 1,250 మంది రోగులను ఈ పరిశోధన కోసం ఎంపిక చేయనున్నారు. ప్రామాణిక చికిత్సతో పాటు ఆయుర్వేద మందులు ఇవ్వడం వల్ల రోగుల శరీర బరువు, పోషకాహార ఫలితాలు, వ్యాధి తీవ్రత, జీవన నాణ్యత, భద్రత వంటి అంశాలపై ఎలాంటి ప్రభావం ఉంటుందో అంచనా వేయడమే ఈ అధ్యయనం ముఖ్య ఉద్దేశం. ఈ స్టడీ 'హోల్-ఆఫ్-సైన్స్' (సంపూర్ణ విజ్ఞానం) స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. బయోటెక్నాలజీ, ఆయుర్వేదం వంటి శాస్త్రాలను ఏకం చేయడం, మంత్రిత్వ శాఖలు కలిసి పనిచేయడం గొప్ప విషయమని తెలిపారు. డెక్సా, ఎంఆర్ఐ, ఇమ్యూన్ ప్రొఫైలింగ్, మెటబొలోమిక్స్ వంటి అధునాతన సాధనాలను ఉపయోగించి రోగుల శరీరంలో మార్పులను పరిశీలిస్తామని బీఆర్ఐసీ-ఎన్ఐఐ డైరెక్టర్ డాక్టర్ దేబశిస మొహంతి వివరించారు. ప్రపంచంలోని మొత్తం టీబీ కేసుల్లో దాదాపు 25 శాతం భారత్‌లోనే ఉన్నాయని, అయితే గత దశాబ్దంలో దేశంలో క్షయ వ్యాధి 21 శాతం తగ్గిందని మంత్రి జితేంద్ర సింగ్ గుర్తుచేశారు. "క్షయ రహిత భారత్ కోసం సమష్టిగా కృషి చేస్తాం" అన్న ప్రధాని మోదీ మాటలను ఆయన ఉటంకించారు. డయాబెటిస్, టీబీ వంటి వ్యాధులకు మధ్య సంబంధం ఉందని, ఒకటి మరొకదాని తీవ్రతను పెంచుతుందని, అందుకే సమీకృత చికిత్సా విధానాలు అవసరమని ఆయన పేర్కొన్నారు.

## తుది శ్వాస విడిచిన హరీశ్ రాణా

న్యూఢిల్లీ: హరీశ్ రాణా మంగళవారం తుదిశ్వాస విడిచారు. ప్రమాదవశాత్తు గాయపడి 13 ఏళ్ల క్రితం కోమాలోకి వెళ్లిపోయిన ఘజియాబాద్‌కు చెందిన హరీశ్ రాణా మృతి చెందినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇటీవలే హరీశ్ తల్లిదండ్రులు కారుణ్య మరణం కోసం కోరగా, సుప్రీంకోర్టు రెండు వారాల కిందట ఆమోదం తెలిపింది. దీనితో ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యులు అతడికి చికిత్స నిలిపివేశారు. హరీశ్ రాణా పంజాబ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో 2013 ఆగస్టు 20న హాస్టల్ భవనం రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో కోమాలోకి వెళ్లిపోయాడు. ఎన్ని ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. కుమారుడి చికిత్స కోసం ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. ఈ క్రమంలో కారుణ్య మరణానికి అనుమతించాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## మావోయిస్టు పాపారావు లొంగుబాటు



బస్తర్: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌ను నక్సల్ రహితంగా మారుస్తామని ప్రభుత్వం విధించుకున్న గడువుకు వారం రోజుల ముందే ఒక చారిత్రక పరిణామం చోటుచేసుకుంది. బస్తర్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న చివరి అగ్రశ్రేణి మావోయిస్టు కమాండర్ పాపారావు అలియాస్ సున్నం చంద్రయ్య అలియాస్ మంగు తన సాయుధ బృందంతో సహా పోలీసులకు లొంగిపోయాడు. ఈ పరిణామం మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. 56 ఏళ్ల పాపారావు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో సీనియర్ సభ్యుడు. ఇతను బీజాపూర్ జిల్లాలోని కుట్రు పోలీస్ స్టేషన్‌లో 17 మంది అనుచరులతో (10 మంది పురుషులు, 8 మంది మహిళలు) కలిసి లొంగిపోయాడు. వీరి నుంచి 8 ఏకే-47 రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్, ఒక ఇన్సాస్ రైఫిల్‌ను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. పాపారావు తలపై రూ.2 కోట్ల రివార్డు ఉంది. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత బస్తర్‌లో మోస్ట్ వాంటెడ్ నక్సలైట్‌గా పాపారావు ఉన్నాడు. అతడిపై 50 కేసుల వరకు ఉన్నాయి. సుక్మా జిల్లా కలెక్టర్ ను కిడ్నాప్ చేసిన ఘటనలోనూ, గతంలో 76 మంది భద్రతా సిబ్బందిని బలిగొన్న ఘటనలోనూ పాపారావు హస్తం ఉందని భావిస్తున్నారు. ఈ విషయాన్ని ఛత్తీస్‌గఢ్ హోం మంత్రి, ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ ధృవీకరించారు. పాపారావు లొంగుబాటుతో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో ఇక క్రియాశీల సభ్యులెవరూ లేరని ఆయన తెలిపారు. లొంగిపోయే ముందు తాను పాపారావుతో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. రాష్ట్రం వెలుపల కేవలం ఇద్దరు అగ్ర నేతలు మిషిర్ బెస్రా, గణపతి మాత్రమే మిగిలి ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. పాపారావు లొంగుబాటుతో బస్తర్‌లో సాయుధ నక్సలిజం పూర్తిగా అంతమైందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఈ పరిణామంపై రాష్ట్ర కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. గడువు ముగిసిన తర్వాత అమాయక ఆదివాసులపై వేధింపులు పెరిగే ప్రమాదం ఉందని, వారిపై నక్సలైట్లు అనే ముద్ర వేసి అరెస్టులు చేయవచ్చని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు దీపక్ బైజ్ హెచ్చరించారు. బస్తర్ సహజ వనరులను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే ప్రమాదం కూడా ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

## ఇరాన్ భద్రతా మండలి నూతన అధిపతిగా మహ్మద్ జోల్‌ఘదర్

టెహ్రాన్: ఇరాన్‌కు చెందిన అత్యంత శక్తివంతమైన సుప్రీమ్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కొత్త అధిపతిగా మహమ్మద్ బాగర్ జోల్‌ఘదర్‌ను నియమించారు. ఇటీవల ఆ దేశ భద్రతా చీఫ్ అలీ లారిజానీ ఓ దాడిలో మరణించిన నేపథ్యంలో ఈ నియామకం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. జోల్‌ఘదర్, ఇరాన్ సైన్యంలో కీలకమైన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ లో బ్రిగేడియర్ జనరల్ హోదాలో పనిచేసిన అనుభవజ్ఞుడు. ఈ నియామకానికి ముందు ఆయన ఇరాన్ ఎక్స్‌పెడియెన్సీ కౌన్సిల్ సెక్రటరీగా, అంతకుముందు హోం మంత్రిత్వ శాఖలో భద్రతా వ్యవహారాల డిప్యూటీ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. సుప్రీమ్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ అనేది ఇరాన్ జాతీయ భద్రతా వ్యూహాలను రూపొందించే అత్యున్నత సంస్థ. ఈ పదవిలో జోల్‌ఘదర్ దేశ రక్షణ, అణు కార్యక్రమాలు, విదేశాంగ విధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తారు. ఆయన సైనిక మరియు రాజకీయ అనుభవం ఈ నియామకానికి బలం చేకూరుస్తుందని భావిస్తున్నారు. గత వారం జరిగిన ఓ దాడిలో అలీ లారిజానీ ప్రాణాలు కోల్పోవడంతో ఈ పదవి ఖాళీ అయింది.

వయ్యారి చిత్రం



వాణీకపూర్

# త్వరలో కాలభైరవ కావ్య పెళ్లి?





టాలీవుడ్ యువ గాయకుడు కాల భైరవ, నటి కావ్య కళ్యాణ్‌రామ్ త్వరలో పెళ్లి పీటలు ఎక్కబోతున్నారనే వార్తలు మరోసారి నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ఇటీవల వీరిద్దరూ ఒక పుస్తకావిష్కరణ వేడుకలో జంటగా కనిపించడంతో ఈ పుకార్లకు మరింత బలం చేకూరింది. ఇప్పటికే ఇరు కుటుంబాలు ఈ సంబంధాన్ని ఖాయం చేశాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. చాలా కాలంగా కాల భైరవ, కావ్య కళ్యాణ్‌రామ్ ప్రేమలో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే, తాజాగా ఒక బుక్ లాంచ్ ఈవెంట్‌లో వీరిద్దరూ కలిసి పక్కపక్కనే కూర్చుని సందడి చేయడంతో అందరి దృష్టి వీరిపైనే పడింది. ఇక ఆ ఈవెంట్‌లో వీరి మధ్య ఉన్న సాన్నిహిత్యం చూస్తుంటే, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నిజమేనని అభిమానులు ఫిక్స్ అయిపోతున్నారు. ఈ ఫొటోలు కాస్తా బయటకు రావడంతో క్షణాల్లో వైరల్ అయ్యాయి, నెటిజన్లు వీరికి అప్పుడే శుభాకాంక్షలు చెప్పడం కూడా మొదలుపెట్టేశారు.

# గౌతమ్ మీనన్‌కు షాక్!



నిరంతర వివాదాల కారణంగా ట్యాలెంటెడ్ డైరెక్టర్ గౌతమ్ మీనన్ చాలా చిక్కుల్ని ఎదుర్కొంటున్నారు. తాజాగా ఆయనకు మద్రాస్ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఒక పాత కేసులో ఆయన ఓడిపోయారు. సినిమా కోసం ఖర్చు చేయాల్సిన నిధులను మళ్లించాడని కోర్టు అతడికి చీవాట్లు పెట్టింది. అంతేకాదు.. ఆర్.ఎస్. ఇన్ఫోటైన్‌మెంట్ సంస్థకు ఆయన భారీ జరిమానా చెల్లించాలని ఆదేశించింది. దాదాపు రూ.4.25 కోట్ల అసలు డబ్బును 12శాతం వడ్డీతో కలిపి తిరిగి ఇవ్వాలని కోర్టు తీర్పు వెలువరించింది. ఈ వివాదం 2008లో మొదలైంది. ప్రొడక్షన్ నెం. 6 సినిమా కోసం గౌతమ్ మీనన్ సంస్థ ఫోటాన్ ఫ్యాక్టరీతో నిర్మాత ఎల్రెడ్ కుమార్ (ఆర్.ఎస్. ఇన్ఫోటైన్‌మెంట్) ఒప్పందం చేసుకున్నారు. ఆ సమయంలో నిర్మాత పలు విడతల్లో 4.25 కోట్లు చెల్లించారు. కానీ ఒప్పందం ప్రకారం... నిర్ణీత సమయంలో సినిమా షూటింగ్ ప్రారంభం కాలేదు. దీనిపై నిర్మాత 2013లో సివిల్ సూట్ వేశారు. కోర్టులో గౌతమ్ మీనన్ తన వాదన వినిపించారు. తాము నిర్మించిన -నీతానే ఎన్ పొన్వసంతం- (తెలుగులో -ఎటో వెళ్ళిపోయింది మనసు-) చిత్రమే ఆ ఒప్పందం కింద తీసిన సినిమా అని పేర్కొన్నారు. ఆ సినిమా విడుదలైనందున తమ బాధ్యత తీరిపోయిందని వాదించారు.



# 500 కోట్లే టార్గెట్‌గా చిరు!

సీనియర్ హీరోల్లో మెగాస్టార్ చిరంజీవి సరికొత్త రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. సంక్రాంతి కానుకగా విడుదలైన -మన శంకర వరప్రసాద్ గారు- బాక్సాఫీస్ వద్ద ఏకంగా 400 కోట్ల వసూళ్లను రాబట్టి మెగా స్టామినాను మరోసారి చాటిచెప్పింది. దీంతో చిరంజీవి కెరీర్ లో ఇదే టాప్ గ్రాసర్ గా నిలిచింది. ఈ భారీ విజయం అందించిన ఉత్సాహంతో మెగాస్టార్ తదుపరి చిత్రాల లక్ష్యం 500 కోట్ల మార్కుగా ఫిక్స్ అయింది. వయసుతో సంబంధం లేకుండా యువ హీరోలకు పోటీనిస్తూ చిరంజీవి చేస్తున్న ప్రయోగాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుం టున్నాయి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన మన శంకర వరప్రసాద్ గారు చిత్రంలో చిరు కామెడీ టైమింగ్ , మేనరిజమ్స్ ప్రేక్షకులను మెప్పించడంతో వసూళ్ల వర్షం కురిసింది. 400 కోట్ల క్లబ్‌లో చేరడం అనేది ఒక సీనియర్ హీరోకు సామాన్యమైన విషయం కాదు. మెగాస్టార్ మాత్రం ఇక్కడితో ఆగరు. రాబోయే చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద మరిన్ని సంచలనాలపైనా అన్నయ్య గురి ఉంటుంది. ఈ నేపథ్యంలో అందరి దృష్టి చిరంజీవి నటిస్తోన్న సోషియో ఫాంటసీ అడ్వెంచర్ -విశ్వంభర- పైనే ఉంది. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోన్న ఈ చిత్రం మెగాస్టార్ కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన సినిమాగా ఇప్పటికే హైలైట్ అవుతోంది. ఆ సినిమా 500 కోట్ల మార్కును అందు కుంటుందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# మల్టీస్టారర్ సినిమాలో కీర్తి సురేష్

నేషనల్ అవార్డు విన్నర్, 'మహానటి' కీర్తి సురేష్ ప్రస్తుతం తన కెరీర్‌లో గోల్డెన్ పీరియడ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో వరుస హిట్లు కొడుతూనే, బాలీవుడ్‌లో కూడా 'రఫ్తార్' వంటి క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తాజాగా ఈ అమ్మడు ఖాతాలో మరో భారీ తెలుగు సినిమా వచ్చి చేరినట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. ఇటీవల 'శంకర్ వరప్రసాద్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు అనిల్ రావిపూడి, ఇప్పుడు ఒక భారీ మల్టీస్టారర్ కథను సిద్ధం చేశారు. ఇక ఇందులో విక్టరీ వెంకటేష్ నందమూరి కళ్యాణ్ రామ్ వంటి ఇద్దరు స్టార్ హీరోలు కలిసి నటిస్తుండగా.. కీర్తి సురేష్ హీరోయిన్‌గా అవకాశం దక్కించుకున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు షైన్ స్క్రీన్స్ సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇక ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



# వరుస సినిమాలతో సంయుక్త మీనన్ హవా!

టాలీవుడ్‌లో వరుస హిట్లు అందుకుంటూ గోల్డెన్ లెగ్‌గా పేరు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ సంయుక్త మీనన్ ఇప్పుడు ఒక సరికొత్త ప్రయాణానికి సిద్ధమయ్యారు. ఇప్పటివరకు వెండితెరపై తన అందం, అభినయంతో మెప్పించిన ఈ బ్యూటీ, ఇప్పుడు డిజిటల్ ఎంట్రీ ఇవ్వనుంది. ఈమె తన మొదటి వెబ్ సిరీస్‌ను పట్టాలెక్కించి, ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని పంచడానికి రెడీ అయ్యారు. 'గువ్వల చెరువు ఘాట్' పేరుతో తెరకెక్కుతున్న ఒక భారీ వెబ్ సిరీస్‌లో యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, టాలెంటెడ్ యాక్టర్ తిరువీర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అయితే సంయుక్తతో పాటు కిరణ్ అబ్బవరానికి కూడా ఇదే మొదటి ఓటీటీ ప్రాజెక్ట్ కావడం విశేషం. 'డియర్ కామ్రేడ్' ఫేమ్ భరత్ కమ్మ ఈ సిరీస్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న తేజస్వీరావు కీలక పాత్రలో కనిపించనున్నారు.






# అవమానం భరించలేకపోయా

టాలీవుడ్, బాలీవుడ్ సినిమాల్లో తన గ్లామర్‌తో మెప్పించిన నటి సమీరా రెడ్డి. ప్రస్తుతం ఆమె సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియా ద్వారా నిత్యం వార్తల్లో నిలుస్తూనే ఉంటారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న సమీరా, తన చిన్ననాటి చేదు అనుభవాలను పంచుకున్నారు. 'నా చిన్నతనంలో నాకు తీవ్రమైన నత్తి ఉండేది. నేను ఏదైనా మాట్లాడటానికి ప్రయత్నిస్తే అక్షరాలు సరిగ్గా వచ్చేవి కావు. దానివల్ల నాతో పాటు చదువుకునే పిల్లలు, చుట్టుపక్కల వారు నన్ను విపరీతంగా వెక్కిరించేవారు. నన్ను ఆటపట్టిస్తూ వేధించేవారు. ఆ వయసులో ఆ అవమానాలు భరించడం నాకు చాలా కష్టంగా ఉండేది. నా ఆత్మవిశ్వాసం పూర్తిగా దెబ్బతిన్న సమయం అది ఈ సమస్య నుండి బయటపడటానికి, నాపై నాకు నమ్మకం కలగడానికి నేను సంవత్సరాల తరబడి థెరపీ చేయించుకోవాల్సి వచ్చింది. ఎన్నో వ్యాయామాలు, కఠినమైన ప్రాక్టీస్ తర్వాతే నేను ఈ రోజు ఇలా ధైర్యంగా మాట్లాడగలుగుతున్నాను.



# సర్జరీ చేయించుకోలేదు

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ అలయ ఎఫ్ తనపై వస్తున్న ప్లాస్టిక్ సర్జరీ వార్తలను తీవ్రంగా ఖండించారు. ఇటీవల ముంబైలో జరిగిన 'లాక్మే ఫ్యాషన్ వీక్'లో ఆమె ర్యాంప్ వాక్ చేసిన తర్వాత, ఆమె ముఖంలో మార్పు వచ్చిందని, ముఖ్యంగా ముక్కు, పెదవులకు సర్జరీ చేయించుకుందంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. తాజాగా, ఈ విషయంపై అలయ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ వీడియో షేర్ చేస్తూ క్లారిటీ ఇచ్చింది. 'చాలా మంది నేను ఏదో సర్జరీ చేయించుకున్నానని అనుకుంటున్నారు. నాకు ముక్కు, పెదవుల సర్జరీ గురించి వరుసగా కామెంట్స్ వస్తున్నాయి.



# ఎల్ కవర్‌పై శోభిత సోయగాలు

గ్లోబల్ బ్యూటీ శోభిత ధూళిపాళ్ల మరోసారి ఇంటర్నేషనల్ ఫ్యాషన్ వేదికపై తన ముద్ర వేసింది. ప్రతిష్టాత్మకమైన 'ఎల్' మ్యాగజైన్ 'ది ఆర్ట్ ఇష్యూ' కోసం కవర్ స్టార్‌గా మారి అందరి దృష్టిని ఆకర్షించింది. తనదైన స్టైల్, గ్రేస్ మరియు అదిరిపోయే యాటిట్యూడ్‌తో శోభిత చేసిన ఈ ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఫ్యాషన్ ప్రపంచంలో ఎల్ మ్యాగజైన్ కవర్‌పై కనిపించడం అంటే సామాన్యమైన విషయం కాదు. శోభిత ధూళిపాళ్ల తన అద్భుతమైన పర్సనాలిటీతో ఆ అవకాశాన్ని దక్కించుకుంది. ఈ షూట్‌లో ఆమె ధరించిన అవుట్‌ఫిట్స్, ఆమె ఇచ్చిన పోజులు చాలా ఆర్టిస్టిక్‌గా ఉన్నాయి. కేవలం నటనతోనే కాకుండా, ఫ్యాషన్ సెన్స్‌తో కూడా శోభిత తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుందని ఈ కవర్ పేజీ చూస్తే అర్థమవుతోంది. ఆమె కళ్లలో ఉన్న తీక్షణత, ధరించిన హై-స్లిట్ డ్రెస్ ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.



# రాజస్థాన్ రాయల్స్.. రూ.15,300 కోట్లు

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి రంగం సిద్ధమైంది. మరో నాలుగు రోజుల్లో ఈ క్యాష్ రిచ్ లీగ్‌కు తెరలేవనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య చిన్నస్వామి స్టేడియం వేదికగా శనివారం తొలి మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే 10 జట్లు తమ సన్నాహకాల్లో నిమగ్నమై.. ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్నాయి. అయితే ఈ సీజన్ ప్రారంభానికి ముందే రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ చేతులు మారింది. అమెరికా వ్యాపారవేత్త కల్ సోమానీ నేతృత్వంలోని కన్సార్టియం ఈ జట్టులోని 100 శాతం వాటాను కొనుగోలు చేసింది. దాదాపు రూ.15,300 కోట్ల(1.63 బిలియన్ డాలర్లు) భారీ ధరకు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అతి పెద్దగా డీల్ అని వ్యాపార నిపుణులు చెబుతున్నారు. కల్ సోమానీతో పాటు వాల్‌మార్ట్ కుటుంబానికి చెందిన ప్రముఖ అమెరికన్ వ్యాపారవేత్త రాబ్ వాల్టన్, అలాగే హాంప్ కుటుంబం ఈ కొనుగోలు కన్సార్టియంలో భాగస్వాములుగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఐపీఎల్ సీజన్ పూర్తయిన తర్వాత రాజస్థాన్ రాయల్స్ టీమ్ యాజమాన్యం అధికారికంగా వీరి చేతుల్లోకి వెళ్లనుంది. గతంలో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలో 65 శాతం వాటాను ఎమర్జింగ్ మీడియా వెంచర్స్ అధినేత మనోజ్ బదాలే కలిగి ఉండగా.. మిగిలిన 35 శాతాన్ని రెడ్‌బర్డ్ క్యాపిటల్ పార్ట్‌నర్స్, లాచ్‌లాన్ మర్డోక్ పంచుకున్నారు. ఈ వాటా విక్రయ ప్రక్రియ గత ఏడాది చివరిలో ప్రారంభమైంది. ది



రెయిన్ గ్రూపు పెట్టుబడి బ్యాంక్ సలహాదారుగా వ్యవహరించింది. ఆదిత్య బిర్లా గ్రూపు వంటి దిగ్గజ సంస్థలు ఆసక్తి చూపినప్పటికీ, సోమానీ కన్సార్టియం ముందంజలో ఉన్నట్లు గతంలోనే వార్తలు వచ్చాయి. గతంలో గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీలోని 67 శాతం వాటాను సీవీసీ క్యాపిటల్ రూ.5,025 కోట్లకు టోరెంట్ గ్రూప్‌కు అమ్ముకుంది.



### కల్ సోమానీ ఎవరంటే..

కల్ సోమానీ అరిజోనాకు చెందిన ఓ సీరియల్ ఎంటర్‌ప్రెన్యూర్. ఎడ్యుటెక్, డేటా సీక్రెసీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అడ్మినిస్ట్రేషన్, స్పోర్ట్స్ టెక్ రంగాలలో ఆయనకు 15 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది. ఇంట్రాఎడ్జ్, ట్రూయో వంటి అనేక టెక్ సర్వీసుల వెంచర్లకు వ్యవస్థాపకుడు కూడా. ఏఐ అడ్మినిస్ట్రేషన్ కార్యకలాపాల్లో విశేష అనుభవం కలిగిన సోమానీ, మోటార్ సిటీ గోల్ఫ్ క్లబ్‌కు సహ-యజమానిగానూ వ్యవహరిస్తున్నారు. టీఎంఆర్ డబ్ల్యూ స్పోర్ట్స్, టీజీఎల్ గోల్ఫ్ లీగ్ వంటి వెంచర్లలో కల్ సోమానీ ప్రారంభ పెట్టుబడిదారుగా ఉన్నారు. కాగా, రాజస్థాన్ రాయల్స్‌లో ఆయన తొలిసారిగా 2021లోనే పెట్టుబడి పెట్టారు.



## ఆర్సీబీకి కొత్త యజమాని

# 16,706 కోట్లకు బిర్లా చేతుల్లోకి!

ఐపీఎల్ 2026 ముంగిట డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంఛైజీ చేతులు మారింది. రూ.16,706 కోట్లకు ఆర్సీబీని ఆదిత్యబిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ కొనుగోలు చేశాయి. బ్రిటీష్ డిస్టిలరీస్, యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ మాతృసంస్థ అయిన డియాజియో కంపెనీ మొన్నటివరకు ఆర్సీబీకి యజమానిగా ఉంది. 2008లో ఐపీఎల్ ఆరంభ సమయంలో యూబీ గ్రూపు అధినేత విజయ్ మాల్యా బెంగళూరు ఫ్రాంఛైజీని దక్కించుకున్నాడు. అనంతరం మాల్యా అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో భారత్‌లోని తన అనుబంధ సంస్థ యునైటెడ్ స్పిరిట్స్ ద్వారా బెంగళూరు ఫ్రాంఛైజీని డియాజియో కొనుగోలు చేసింది. తాజాగా డియాజియో బెంగళూరు ఫ్రాంఛైజీని ఆదిత్యబిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్‌నకు విక్రయించింది. ఐపీఎల్ 2026 మార్చి 28 నుంచి మొదలుకానున్న సంగతి తెలిసిందే. తొలి మ్యాచ్‌లో ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి.



## యష్ దయాల్ అవుట్: ఆర్సీబీ

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) స్టార్ పేసర్ యష్ దయాల్ వ్యక్తిగత కారణాలతో ఐపీఎల్ 2026 సీజన్ ఆడటం లేదని ఆ జట్టు క్రికెట్ డైరెక్టర్ మో బోబాట్ అన్నారు. మంగళవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఈ సీజన్‌కు దూరమైనా.. యశ్ దయాల్ ఆర్సీబీతో కాంట్రాక్ట్‌లోనే ఉన్నాడని పేర్కొన్నారు. అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న యశ్ దయాల్‌పై పోక్సో కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఓ మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు జైపూర్‌లో ఓ కేసు నమోదైంది. ఐపీఎల్ 2025 సీజన్ సమయంలో హోటల్‌లో కూడా సదరు అమ్మాయిని వేధించినట్లు ఆరోపణలు వచ్చాయి.



## నేడు ఐపీఎల్ కెప్టెన్లతో బీసీసీఐ భేటీ

క్రికెట్ అభిమానులకు వేసవి వినోదాన్ని పంచేందుకు ఐపీఎల్ సిద్ధమవుతోంది. పంతొమ్మిదో సీజన్‌కు మరో నాలుగు రోజులే ఉంది. టోర్నీ సమీపిస్తున్నందున పది జట్ల కెప్టెన్లతో భారత క్రికెట్ నియంత్రణ మండలి సమావేశం నిర్వహించనుంది. బుధవారం ఐపీఎల్ కెప్టెన్లతో భేటీ సాయంత్రం 4 గంటలకు జరుగనుది. ఈ సందర్భంగా బీసీసీఐ, పది జట్ల సారథుల మధ్య పలు కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశముంది. ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ తొలి దశ మ్యాచ్‌లు మార్చి 28 నుంచి ప్రారంభం కానున్నాయి. దాంతో, పది జట్ల ఆటగాళ్లు నెట్స్ ప్రాక్టీస్, సన్నాహక ప్రాక్టీస్ మ్యాచ్‌లతో బిజీగా గడుపుతున్నారు. మెగా ఈవెంట్‌కు మరో నాలుగు రోజులే ఉన్నందున అందరు కెప్టెన్లతో బీసీసీఐ భేటీ అవ్వనుంది. మార్చి 25 (బుధవారం) సాయంత్రం పది జట్ల సారథులతో బీసీసీఐ కీలక అంశాలపై చర్చించనుంది. క్రిక్‌బజ్ కథనం ప్రకారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకూ కెప్టెన్లతో సమావేశం ఉంటుందని మంగళవారమే ఫ్రాంచైజీలకు సమాచారం వెళ్లింది. బీసీసీఐ మ్యాచ్ రిఫరీలు జవగళ్ శ్రీనాథ్, నితిన్ మీనన్, అంపైర్ ప్యానెల్ సభ్యులు కెప్టెన్లతో మాట్లాడనున్నారు. ఈ సందర్భంగా ఇన్నింగ్స్ టైమర్(60 సెకన్లు), ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన, కంకషన్ సబ్‌స్టిట్యూట్, ఒక ఓవర్లో రెండు బౌన్సర్లు, బ్యాట్ చెకింగ్, బంతిని మార్చడం, బంతిపై లాలాజలం రుద్దడం, రిటైర్డ్ ఔట్ నియమాలు.. వంటివి ప్రధానంగా చర్చకు రానున్నాయి. ఈ అంశాలపై మ్యాచ్ రిఫరీలు, అంపైర్లు పది జట్ల కెప్టెన్ల అభిప్రాయాలు, సందేహాలను తెలుసుకోనున్నారు.

# బీసీసీఐ వెరీ స్ట్రిక్ట్

### ఐపీఎల్ కోసం కొత్త రూల్స్

ఐపీఎల్ 2026 సీజన్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) నయా రూల్స్‌ను ప్రకటించింది. ఆటగాళ్లు, సిబ్బంది ఈ నియమాలను కచ్చితంగా పాటించాలని పేర్కొంది. ఈ రూల్స్‌ను అతిక్రమిస్తే మందలింపుతో పాటు భారీ జరిమానాలు ఉంటాయని హెచ్చరించింది. మార్చి 28న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో ఐపీఎల్ 2026 సీజన్‌కు తెరలేవనుంది. ఈ క్రమంలోనే బీసీసీఐ ఈ సీజన్‌లో పాటించాల్సిన నయా రూల్స్ జాబితాను టీమ్ మేనేజర్లకు అందజేసింది.

### ప్రాక్టీస్ రూల్స్:

- ఓపెన్ నెట్స్‌కు అనుమతి లేదు. నెట్స్‌లోనే ప్రాక్టీస్ చేయాలి.
- ఒక జట్టు తన ప్రాక్టీస్‌ను ముందుగానే ముగించినప్పటికీ.. ఆ జట్టుకు కేటాయించిన పిచ్‌లను రెండో జట్టు వాడుకోవడానికి అనుమతి లేదు.
- మ్యాచ్ రోజున ప్రాక్టీస్‌కు అనుమతి లేదు. ఎలాంటి ప్రాక్టీస్ సెషన్లు ఉండవు.
- మ్యాచ్ రోజున మైదానంలో ఎలాంటి ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించకూడదు.
- ప్రాక్టీస్ రోజుల్లో డ్రెస్సింగ్ రూమ్ ఆటగాళ్లు, అక్రిడిటేషన్ ఉన్న సిబ్బందిని మాత్రమే మైదానంలోకి అనుమతిస్తారు.
- ఆటగాళ్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు ఇతర వాహనల్లో రావాలి. వారికి మైదానంలోకి అనుమతి లేదు. హాస్పిటాలిటీ ఏరియా నుంచి మాత్రమే ప్రాక్టీస్‌ను చూడాలి.
- ఫ్రాంచైజీలు త్రోడౌన్ స్పెషలిస్ట్‌లు, నెట్ బౌలర్ల జాబితాను బీసీసీఐ ఆమోదం కోసం సమర్పించాలి.
- ఆటగాళ్లు ప్రాక్టీస్ కోసం టీమ్ బస్సునే ఉపయోగించాలి. జట్లు రెండు బ్యాచ్‌లుగా ప్రయాణించవచ్చు. ప్రాక్టీస్ సంబంధిత అభ్యర్థనల కోసం వెన్యూ మేనేజర్‌ను సంప్రదించాలి.

### మ్యాచ్-డే రూల్స్..

- సిబ్బంది తప్పనిసరిగా తమ అక్రిడిటేషన్ కార్డులను కలిగి ఉండాలి. మొదటిసారి మర్చిపోతే హెచ్చరిక, రెండోసారి రిపీట్ చేస్తే జరిమానా విధిస్తారు.
- హిట్టింగ్ నెట్లు ఉన్నప్పటికీ, ఆటగాళ్లు ఎల్‌ఈడీ బోర్డులపై బంతులు కొట్టకుండా జాగ్రత్త వహించాలి.
- ఆటగాళ్లు, సిబ్బంది ఎల్‌ఈడీ బోర్డుల ముందు కూర్చోకూడదు. సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు ఎక్కడ కూర్చోవాలో స్పాన్సర్‌షిప్ టీమ్ మార్క్ చేస్తుంది.
- ఆరెంజ్, పర్పుల్ క్యాప్స్: సంబంధిత ఆటగాళ్లు తప్పనిసరిగా ఆరెంజ్, పర్పుల్ క్యాప్‌లను ధరించాలి.
- ప్రెజెంటేషన్ రూల్స్: పోస్ట్ మ్యాచ్ ప్రెజెంటేషన్‌లో ఫ్లాప్పీ హ్యాట్స్, స్లీవ్‌లెస్ జెర్సీలు ధరించకూడదు. రూల్స్ ఉల్లంఘిస్తే జరిమానా తప్పదు.
- సపోర్ట్ స్టాఫ్: ఐపీఎల్ 2025 తరహాలోనే.. మ్యాచ్ రోజున డాక్టర్‌తో కలిపి కేవలం 12 మంది సిబ్బందికి మాత్రమే అనుమతి ఉంటుంది.


### దుస్తులు, ఇతర రూల్స్:

జెర్సీ నంబర్లు మార్చాలనుకుంటే 24 గంటల ముందే లీగ్‌కు సమాచారం ఇవ్వాలి. బీసీసీఐ ముందస్తు అనుమతితో గరిష్ఠంగా రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడుకోవచ్చు. కానీ అవి సైడ్ వికెట్లపైనే జరగాలి. లైట్ల కింద ఆడితే 3.30 గంటల కంటే ఎక్కువ సమయం తీసుకోకూడదు. ఫ్రాంచైజీ తన తొలి హోమ్ మ్యాచ్‌కు నాలుగు రోజుల ముందు నుంచి మెయిన్ స్క్వేర్‌పై ప్రాక్టీస్ చేయకూడదు. అవసరమైతే స్టేట్ అసోసియేషన్ సహకారంతో ప్రత్యామ్నాయ వేదికను ఏర్పాటు చేసుకోవాలి.



## కమ్మిన్స్ వచ్చేస్తున్నాడు!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్ దగ్గరికొచ్చింది. ఈ నెల 28న ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు- సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) మధ్య జరుగనుంది. ఈ ఐపీఎల్ ఓపెనర్ కు బెంగళూరు ఎం చిన్నస్వామి స్టేడియం ఆతిథ్యాన్ని ఇవ్వనుంది. ప్రస్తుతం 10 జట్లు తమ సన్నాహకాల్లో నిమగ్నం అయ్యాయి. ప్లేయర్లందరూ తమ జట్లతో కలుస్తున్నారు. ముమ్మరంగా ప్రాక్టీస్ సాగిస్తోన్నారు. ఈ పరిస్థితుల మధ్య సన్ రైజర్స్ హైదరాబాద్ కు శుభవార్త అందింది. గాయం కారణంగా ప్రారంభ మ్యాచ్ లకు దూరమౌతాడని భావించిన ఆ జట్టు కేప్టెన్ పాట్ కమ్మిన్స్ అందుబాటులోకి వచ్చాడు. నేడు నేరుగా బెంగళూరుకు చేరుకోనున్నాడు. జట్టుతో కలవనున్నాడు. ఆర్సీబీతో జరిగే ఐపీఎల్ ఓపెనర్ లో అతను ఆడతాడా లేదా అనేది ఇంకా తెలియరావాల్సి ఉంది. పాట్ కమ్మిన్స్ ఆడకపోతే ముందుగా ప్రకటించినట్టుగా ఓపెనర్ ఇషాన్ కిషన్ ఆ మ్యాచ్ కు కేప్టెన్ గా వ్యవహరిస్తాడు. వెన్నునొప్పి నుంచి కమిన్స్ కోలుకున్న నేపథ్యంలో అతని రాకపై నెలకొన్న అనిశ్చితికి తెరపడింది. కొత్త ఆటగాడు జాక్ ఎడ్వర్డ్స్ కాలి గాయంతో టోర్నీకి దూరమవడంతో సన్‌రైజర్స్‌పై పడిన ఒత్తిడిని కమిన్స్ రాక కొంతవరకు తగ్గించినట్టయింది. ఐపీఎల్ ప్రారంభానికి ముందు కెప్టెన్‌ల సమావేశానికి ఇషన్ కిషన్ హాజరుకానున్నాడు. బుధవారం బెంగళూరులో ఈ సమావేశం జరుగనుంది. ఈ సమావేశం కంటే ముందుగానే పాట్ కమ్మిన్స్ బెంగళూరుకు చేరుకున్నా కేప్టెన్ల సమావేశానికి ఇషాన్ కిషన్ పాల్గొనబోతున్నాడు.



ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
బుధవారం 25-3-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# కాలుష్య కోరల్లో భవిష్యత్తు!

నేడు అభివృద్ధి పేరుతో మనం సాగిస్తున్న ప్రయాణం వినాశనం వైపు అడుగులు వేస్తోంది. దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాలు అనే తేడా లేకుండా కాలుష్యం కోరలు చాస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత కలుషిత నగరాల జాబితాలో భారతదేశానికి చెందిన అనేక నగరాలు చోటు సంపాదించుకోవడం మనం గర్వపడాల్సిన విషయం కాదు, ఆందోళన చెందాల్సిన అంశం. గాలిలోని నాణ్యత రోజురోజుకూ పడిపోతోంది. వాహనాల నుండి వెలువడే ఉద్గారాలు, పరిశ్రమల పొగ, నిర్మాణ రంగంలోని దుమ్ము గాలిని విషతుల్యం చేస్తున్నాయి. ఈ వాయు కాలుష్యం వల్ల ప్రతి ఏటా వేల సంఖ్యలో అకాల మరణాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు శ్వాసకోశ వ్యాధులతో అల్లాడుతున్నారు. గాలి పీల్చుకోవడమే గండంగా మారిన ఈ తరుణంలో, స్వచ్ఛమైన గాలిని అందించడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం కావాలి. మరోవైపు మన నదులు మురుగు కాలువలుగా మారుతున్నాయి. నదులలో కలిసే కాలుష్యంలో దాదాపు 75% మునిసిపల్ మురుగునీరు, మిగిలిన 25% పారిశ్రామిక వ్యర్థాల వల్ల జరుగుతోంది. భారతదేశంలో సంభవిస్తున్న దాదాపు 80% వ్యాధులు కలుషిత నీటి వల్లే వస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. గంగ, యమున వంటి పవిత్ర నదుల ప్రక్షాళనకు ఎన్ని కోట్లు ఖర్చు చేసినా, మూలం వద్ద మార్పు రాకపోతే ఆ ఫలితాలు శూన్యం. 1981 నాటి వాయు కాలుష్య నివారణ చట్టం వంటివి కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, కఠినంగా అమలు చేయాలి. పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలి. మొక్కలు నాటడం, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాల్లో సామాన్యులను భాగస్వాములను చేయాలి. కాలుష్యం అనేది కేవలం పర్యావరణ సమస్య కాదు, ఇది మానవ మనుగడకు సంబంధించిన ప్రశ్న. ప్రకృతిని మనం రక్షిస్తేనే, అది రేపటి తరాన్ని కాపాడుతుంది. ప్రభుత్వాలు, పారిశ్రామికవేత్తలు మరియు ప్రజలు సమష్టిగా పోరాడితేనే ఈ 'కాలుష్య మహమ్మారి' నుండి మనం బయటపడగలం.

## గళం ఘాటెక్కితే.. గౌరవం గంగపాలే..

అగ్గిపిడుగుల గళంతో
గరికపాటి వారి ప్రవచనం
అజ్ఞానాంధకారంపై అస్త్రం...
అంధవిశ్వాసాలపై అగ్నివర్షం
సంఘసంస్కర్తలా ఝులిపించు...
సామాజిక రుగ్మతలపై ఆధ్యాత్మిక కొరడా.!

ఉపమానాల ఉరుములతో
చమత్కారాల చిరుజల్లులతో
చైతన్యపు జ్వాలలు రగిలించే
ప్రవచన వీరుడు సహస్రావధాని
పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి
ఘాటైన వివాదాస్పద వ్యాఖ్యలు
సోషల్ మీడియాలో తెగ వైరల్...!

చిన్నమాట ఒకటి జారితే
మంచు జలధి కూడా
మండే గుండమై పోగలదు..!

ఆకలి తీరిన కడుపు
విద్యకు మూలధనం
మధ్యాహ్న భోజన పథకం
ప్రభుత్వ నైతిక బాధ్యత
అది పేద విద్యార్థుల హక్కు..
బంగారు భవిష్యత్‌కు బాట..!

"గుడ్డు వద్దు గాడిద గుడ్డు వద్దు"
"బడిలో తిండి తిన్న బిడ్డలు...
"శోభనం గదిలో కొత్త పెళ్లికొడుకులన్న"
ఘాటైన తూటాల్లాంటి మాటలు
పేదరికం పై కురిసిన పిడుగుల వాన
పేదవిద్యార్థులపై పాము పడగ నీడలు..!

పొతాలు బుర్రకెక్కేది...పొట్ట నిండినప్పుడే..!
ప్రతిభ పుష్పించేది పోషణం అందినప్పుడే..!

ఘాటైన మాటల కన్న
గాఢమైన మార్గనిర్దేశం మిన్న...
విమర్శల వాన కన్న...సలహాల
సూచనల సుమజల్లే మిన్న...!

నిజమేదైనా...నిగ్రహం స్పందనైతే
గౌరవం గంగలా పొంగి పొర్లుతుంది
క్షమను కోరితే ప్రతిష్ఠ పర్వతమౌతుంది..!

ఆకలితీర్చే హస్తమే...అనాథలకు శరణం
అది అక్షర భవిష్యత్తుకు ఆదిత్య కిరణం
పౌష్టికాహారం డ్రాప్ ఓట్స్ తగ్గడం కోసమే
విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం.!

-పోలయ్య కూకట్లపల్లి,
అత్తాపూర్, హైదరాబాద్

# గిఫ్ట్ డీడ్.. తెలుసుకోండి ఇవీ!

ప్రతి మనిషి ఏదో ఒక సందర్భములో తన వాళ్ళకి లేదా తాను కోరుకున్న వాళ్ళకి ఏదో ఒక రూపములో బహుమతి ఇస్తూ ఉంటారు. అది ఒక పుట్టినరోజు బహుమతి కావచ్చు లేదా ప్రేమతో ఇచ్చే ఇంకేదైనా బహుమతి కావచ్చు. అట్టి బహుమతులు నానా రకాలుగా ఉంటాయి. చిన్న పిల్లలకు ఇచ్చే ఆట వస్తువుల నుంచి పెద్దవారి వరకు ఇచ్చే ఎలాంటి బహుమతులైనా వివిధ రూపాలలో వివిధ రకాలుగా ఉంటాయి. అయితే పిల్లలకు ఇచ్చే ఆట వస్తువులు లాంటి బహుమతులకు లేదా తమ స్నేహితులకు గుర్తుగా ఇచ్చే ఇతరేతర బహుమతులకు ఎలాంటి బహుమతి పత్రాలు అవసరం లేదు. కానీ ఆస్తుల రూపంలో ఇచ్చే బహుమతులకు మాత్రము తగిన పత్రాలు ఉంటే మాత్రమే అట్టి బహుమతి చెల్లుబాటు అవుతుంది. ఒక వ్యక్తి తన ఇల్లు లేదా పొలము అట్టి ఆస్తులను బహుమతిగా వ్రాతపూర్వకముగా ధారాదత్తము చేయడాన్ని గిఫ్ట్ డీడ్ లేదా ఆస్తి బహుమతి పత్రము అంటారు. గిఫ్ట్ డీడ్ చేసే వ్యక్తిని డోనార్ అంటారు. గిఫ్ట్ డీడ్ ద్వారా బహుమతిని పొందే వ్యక్తిని డోనీ అని అంటారు. కొన్ని ఆస్తి బదలాయింపులు నోటరీ ద్వారా జరుగుతుంటాయి. కొన్ని ఆస్తి బదలాయింపులు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ద్వారా జరుగుతుంటాయి. ఈ రెండు మార్గాలలో రిజిస్ట్రేషన్ పద్ధతి ద్వారా ఆస్తి బహుమతులను బదలాయింపు చేయించడం ఎంతో ఉత్తమమైన మార్గము. ఒక వ్యక్తి రెండు రకాలైన వ్యక్తులకు గిఫ్ట్ డీడ్ చేయవచ్చు. అది ఒకటి రక్త సంబంధీకులు అయి ఉండవచ్చు లేదా ఇతరులు అయి ఉండవచ్చు. ఇట్టి గిఫ్ట్ డీడ్ రెండు రకాలుగా చేయవచ్చు.



ఏజే కరణ్‌లాల్, అడ్వొకేట్,
9492557496,
advocateajkl@gmail.com

మొదటిది కండీషనల్ గిఫ్ట్ డీడ్, రెండవది అన్-కండీషనల్ గిఫ్ట్ డీడ్. మొదటి రకమైన కండీషనల్ గిఫ్ట్ డీడ్ ద్వారా బదిలీ చేసే ఆస్తి బదలాయింపులు వివిధ రకాలైన కండీషన్ల ద్వారా ఆస్తి బదలాయింపు జరుగుతుంది. అనగా ఒక వ్యక్తి వయసు మీరి తనను చూసుకునే వారు ఎవరు లేక తన ఆస్తిని ఇంకొక వ్యక్తికి బదిలీ చేస్తూ తాను జీవించినంత కాలం తన బాగోగులు చూసుకున్నట్లయితె మాత్రమే తన ఆస్తి బదలాయింపు జరుగుతుంది అని గిఫ్ట్ డీడ్ లో తెలియజేసినట్లయితే అట్టి సందర్భములలో మాత్రమే అట్టి గిఫ్ట్ డీడ్ చెల్లుబాటు అవుతుంది. కండీషనల్ గిఫ్ట్ డీడ్ అనేది ఎప్పుడైనా రద్దు చేయవచ్చు. ఇక రెండవ రకమైన అన్-కండీషనల్ గిఫ్ట్ డీడ్ లో తన ఆస్తి బాదలాయింపులో ఎలాంటి కండీషన్లు లేనట్లైతే అట్టి గిఫ్ట్ డీడ్ ద్వారా ఆస్తి బదలాయింపు సంపూర్ణముగా జరుగుతుంది. అన్-కండీషనల్ గిఫ్ట్ డీడ్ అనేది రద్దు చేయడానికి వీలు ఉండదు. గిఫ్ట్ డీడ్ చేసే ఆస్తి అనేది సదరు వ్యక్తి స్వార్జితము అయిన ఆస్తి అయి ఉండాలి., గిఫ్ట్ డీడ్ చేసే వ్యక్తికి అట్టి బహుమతిగా ఇస్తున్న ఆస్తి పైన సర్వ హక్కులూ కలిగి ఉండాలి. అట్టి ఆస్తి ఎలాంటి ప్రభుత్వ భూమి కానీ, ఫారెస్ట్ భూమి కానీ అయి ఉండకూడదు. అట్టి భూములపై చేసిన గిఫ్ట్ డీడ్ అనేది చెల్లదు., గిఫ్ట్ డీడ్ చేసే వ్యక్తి మానసికంగా, శారీరకంగా ఆరోగ్యముగా ఉండాలి. మానసిక రొగులు చేసే గిఫ్ట్ డీడ్ చెల్లదు., తాగిన మైకంలో చేసే గిఫ్ట్ డీడ్ అనేది కూడా చెల్లదు.

గిఫ్ట్ డీడ్ చేసే ప్రాపర్టీ అనేది రెండు రకాలుగా ఉంటుంది. మొదటిది మూవబుల్ ప్రాపర్టీ. రెండవది ఇమూవబల్ ప్రాపర్టీ. ఇట్టి రెండు రకములైన ఆస్తులలో డోనర్ అనే వారు ఆస్తులను బదలాయించవచ్చు. గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేస్తే మాత్రమే చెల్లుబాటు అవుతుంది. రిజిస్ట్రేషన్ చేయని గిఫ్ట్ డీడ్ చెల్లదు. గిఫ్ట్ డీడ్ ద్వారా వచ్చిన ఆస్తి స్వార్జితమైన ఆస్తి అవుతుంది. ట్రాన్స్ఫర్ ఆఫ్ ప్రాపర్టీ ఆక్ట్,1882 (ఆస్తి బదలాయింపు చట్టము,1882) ప్రకారము గిఫ్ట్ డీడ్ ద్వారా డోనార్ అనే వారు గిఫ్ట్ డీడ్ నకు బదులుగా ఎలాంటి డబ్బును పొందరాదు. ఒకవేళ అలా డబ్బు డోనీ ద్వారా పొందినట్లైతే అట్టి గిఫ్ట్ డీడ్ చెల్లదు. అనగా గిఫ్ట్ డీడ్ అనేది సంపూర్ణముగా యిష్టపుర్వకముగా ప్రేమతో ఇచ్చినది అయి ఉండాలి. గిఫ్ట్ డీడ్ అనేది బలవంతముతో చేసినది అయి ఉండకూడదు. సదరు గిఫ్ట్




డీడ్ చేసే వ్యక్తి తన సంపూర్ణ సమ్మతితో గిఫ్ట్ డీడ్ చేయాలి. ఎవరి బలవంతముతో చేయకూడదు. అట్టి బలవంతముగా చేసిన గిఫ్ట్ డీడ్ చెల్లదు., మోసపూరితమైన మార్గము ద్వారా గిఫ్ట్ డీడ్ పొందకూడదు. అట్టి మోసము ద్వారా పొందిన గిఫ్ట్ డీడ్ అనేది చెల్లదు. ఇట్టి బలవంతముగా చేసిన లేదా మోసపూరితముగా పొందిన గిఫ్ట్ డీడ్లను ఎప్పుడైనా ఉపసంహరించుకోవచ్చు. సీనియర్ సిటిజన్లు చేసిన గిఫ్ట్ డీడ్ వారి పిల్లలు వారిని సరిగా చూసుకొని సందర్భములలో ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. భర్త గిఫ్ట్ డీడ్/సేల్ డీడ్/విల్ డీడ్ ద్వారా భార్య పేరుకు ఇచ్చిన ఆస్తి సదరు భార్య స్వార్జితమైన ఆస్తి అవుతుంది. ఆమె ఎవరికైనా అట్టి ఆస్తిని గిఫ్ట్ డీడ్ చేయవచ్చు. గిఫ్ట్ డీడ్ ద్వారా వచ్చిన ఆస్తిని బహుమతి పొందే వ్యక్తి అనగా డోనీ సమ్మతించాలి. డోనీ ద్వారా సమ్మతి లేని గిఫ్ట్ డీడ్ చెల్లదు. గిఫ్ట్ డీడ్ అనేది డోనార్ జీవిత కాలంలో డోనీ ద్వారా సమ్మతించి ఉండాలి. అలా సమ్మతించనిచో అట్టి గిఫ్ట్ డీడ్ ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది, అట్టి సమ్మతించని గిఫ్ట్ డీడ్ చెల్లదు. కావున ఎవరైనా గిఫ్ట్ డీడ్ చేసే ముందు ఇలాంటి విషయాలు తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. లేదా తగిన అర్హతలు, అనుభవం ఉన్న అడ్వకేట్ ద్వారా వారి సలహాతో ముందుకు సాగినచో ఎలాంటి అవకతవకలు జరిగే అవకాశం ఉండదు.

# అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు: నా అంతర్మథనం



తిప్పని అశోక్ రెడ్డి
హైకోర్టు అడ్వొకేట్

సమాజంలో అన్యాయం జరిగినప్పుడు బాధితుడి పక్షాన నిలబడి, చట్టం అనే ఆయుధంతో పోరాడేవాడు న్యాయవాది. కానీ, నేడు అదే న్యాయవాదికి రక్షణ కరువవ్వడం విచారకరం. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన "తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ బిల్లు, 2024" ఒక ఆశ కిరణంలా కనిపిస్తున్నా, దాని వెనుక కొన్ని చేదు నిజాలు, సవరించాల్సిన లోపాలు దాగి ఉన్నాయి.

### రక్షణ పేరుతో ప్రత్యేక హక్కులా?

ఈ బిల్లు ఒక వృత్తికి ప్రత్యేక రక్షణ ఇస్తుంది. అయితే, న్యాయ వ్యవస్థలో మనం ఎప్పుడూ చెప్పేది ఏమిటి? న్యాయం అందరికీ సమానం. ఒక వృత్తిని చట్టం ముందు ప్రత్యేకంగా నిలబెడితే, మనమే సమానత్వ సూత్రాన్ని దెబ్బతీసినట్టే కాదా? అడ్వకేట్ అనే పేరు మనకు గౌరవం ఇస్తుంది. కానీ అది చట్టానికి మించి స్థానం ఇవ్వదు.

### ఉన్న చట్టాలు సరిపోవా?

దాడి, బెదిరింపు, హింస.. ఇవన్నీ ఇప్పటికే క్రిమినల్ చట్టాల్లో ఉన్నాయి.అయితే మళ్లీ అదే విషయాలను కొత్తగా చట్టం చేయడం వల్ల గందరగోళం పెరుగుతుంది. అమలు క్లిష్టమవుతుంది. చట్టంపై నమ్మకం తగ్గుతుంది. కొత్త చట్టం అవసరం ఉండాలి, పునరావృతం కాదు.

### విమర్శ కూడా నేరమా?

ఈ బిల్లులో కొన్ని నిర్వచనలు చాలా విస్తృతంగా ఉన్నాయి. డెరోగేటరీ లాంగ్వేజ్, మాలిషియస్ యాక్షన్ వంటి పదాలు చాలా ప్రమాదం. ఒక క్లయింట్ అసంతృప్తి వ్యక్తం చేస్తే, ఒక వ్యక్తి కోర్టులో తన బాధ చెప్పుకుంటే.. ఇవి కూడా నేరాలుగా మారే ప్రమాదం ఉంది. ఇది స్వేచ్ఛను తగ్గించే దారి.

### అరెస్టుకు ప్రత్యేక అనుమతి అవసరమా?

ఈ బిల్లులో ఒక ముఖ్యమైన అంశం: అడ్వకేట్ అరెస్టు కోసం ప్రత్యేక అనుమతి అవసరం. ఇది ఒక ప్రశ్నను లేవనెత్తుతుంది. చట్టం ముందు అందరూ సమానమైతే ఇది ఎందుకు ప్రత్యేకంగా? నిజమైన గౌరవం చట్టానికి విధేయతలో ఉంటుంది, ప్రత్యేక రక్షణలో కాదు. ఈ బిల్లులో ఉద్దేశ్యం తప్పు కాదు. అడ్వకేట్‌ల సంక్షేమం, భద్రత అవసరం. కానీ స్పష్టత లేని నిర్వచనాలు, ఇప్పటికే ఉన్న చట్టాలతో ఘర్షణ, అమలులో సమస్యలు చట్టాన్ని బలహీనం చేస్తాయి.

### తక్షణ రక్షణ ఎక్కడ?

ప్రాణాపాయం ఉన్నప్పుడు మేజిస్ట్రేట్ ద్వారా అనుమతి పొంది పోలీసు రక్షణ పొందడం అనేది కాలయాపనతో కూడిన ప్రక్రియ. ఆపదలో ఉన్న న్యాయవాదికి 'గోల్డెన్ అవర్'లో రక్షణ లభించేలా నిబంధనలు ఉండాలి.

### నిధుల భరోసా ఏది?

అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ కేవలం విరాళాల మీద కాకుండా, ప్రభుత్వ బడ్జెట్ నుంచి శాశ్వత నిధిగా ఉండాలి. అప్పుడే జూనియర్ అడ్వకేట్లకు ఇచ్చే స్టైపెండ్ ఒక గౌరవ వేతనంగా మారుతుంది.

### అరెస్టు నిబంధనలు

సెక్షన్ 9 కింద అడ్వకేట్ అరెస్టుకు ఉన్న మినహాయింపులు సమాజంలో మనల్ని ప్రత్యేకంగా కాకుండా, బాధ్యతాయుతంగా చూపాలి. చట్టం ముందు అందరూ సమానమే అన్న సూత్రానికి ఇది భంగం కలగకుండా చూడాల్సిన అవసరం ఉంది. ఈ బిల్లు కేవలం ఒక వర్గానికి రక్షణ కల్పించే చట్టం కాదు, ఇది న్యాయవ్యవస్థ స్వయంప్రతిపత్తిని కాపాడే ఒక కవచం. కోర్టులో వాదించే గళానికి, ఆ గళం వినిపించే మనిషికి భద్రత లేనప్పుడు న్యాయం కుంటుపడుతుంది. కానీ అదే సమయంలో ప్రత్యేక హక్కులు న్యాయాన్ని బలహీనపరుస్తాయి.

### డిమాండ్స్ ఇవీ:

న్యాయవాదిపై దాడి లేదా హత్యను మనం ఇప్పటికీ ఒక వ్యక్తిగత నేరంగా మాత్రమే చూస్తున్నాం. కానీ వాస్తవానికి అది ఒక వ్యక్తిపై దాడి కాదు, ఒక వృత్తిపై దాడి కాదు, న్యాయవ్యవస్థపై దాడిగా గుర్తించాలి.

నూతన క్రిమినల్ చట్టాల్లో ఉన్న స్ట్రక్చరల్ గ్యాప్స్ చాలా ఉన్నాయి

బీఎన్ఎస్/బీఎన్ఎస్ఎస్‌లో అడ్వొకేట్ అనే ప్రత్యేక గుర్తింపు తేవాలి.

విధి నిర్వహణలో న్యాయవాదిపై దాడి జరిగినా పబ్లిక్ సర్వెంట్ ఆన్ డ్యూటీగా గుర్తించాలి.

న్యాయవాదిపై దాడి లేదా హత్యను ఇన్‌స్టిట్యూషనల్ క్రైంగా పరిగణించాలి.

రచయితలకు ఆహ్వానం!
సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..
అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.